
11/1/2012



ప్రత్యేక సంచిక

# యథార్థమైన నాయకత్వం

# అఖిల

అఖిల భారత పత్రిక - జనవరి 2012 ₹ 1

11/1/2012

# నాయకుడు

## శ్రీమాతారవిందుల ప్రవచనములు

### విషయసూచిక



కాలగర్భమందు దివ్యతేజమొకటి ఉద్భవించి
ఉరుములాంటి ఉరవడిని నింపింది మానవరూపంలో.
ఉత్సాహపు ఉరకలతో మెరుపులాంటి బాలుడొకడు
దిగివచ్చాడీ భువిపై. అజేయమైన దివ్యశాంతి,
ప్రీతిగొలుపు ఔన్నత్యం, పావనభావోద్రేకం,
రెక్కలుగల సామర్థ్యం, దిగివచ్చాయీ భువిపై.
సర్వదేవతామూర్తులు దాల్చారో మర్త్యదేహం,
అవతరించి ధరించారు ఒకే నామధేయం.

శ్రీఅరవిందులు

(SABCL Vol. 5, p. 595)

అనువాదం అందుగులపాటి కైలాసపతి, జానకి

# ఆహ్వానం

గిరిశిఖరాగ్రాలపై గిరిధారి లీలావిలాసాలను అవలోకించడానికీ,
ఆ చిద్విలాసావిష్కృత ఆనందవిరులను ప్రకృతి సిగలో విరబూయజేయటానికీ....

నేను వాతావరణ వైపరీత్యాలకు ఎదురొడ్డి కదలి వెళ్తున్నాను
పర్వతాలవైపు, పచ్చిక బయళ్ళ వైపు పాదచారినై.
గతి ప్రతిరోధక బాటలో వాగూవంక దాటి, మంచుటంచుల
మీద గెంతుతూ నాతో ఎవరు కాలు కదుపుతారు? కలసి కొండెక్కుతారు?

నా ఆవాసం, కవాట కుడ్య విభజనతో చిన్నవోయిన
పట్టణాల వలయం కాదు — అవధులెరుగని అనంతవిశ్వం;
పైన నీలిగగనంపై నీలిమేఘశ్యాముడు, ఎదుట
ఎదిరి నిలిచిన పెనుగాలులు, వడగండ్లు రువ్వుతున్న వానలు.

దురదృష్టం నాతో చెలిమి కోరింది, చేయి కలిపింది.
ఈ ఏకాంత సీమలలో ఎదురొడ్డి వినోదక్రీడ లాడుతాను.
ఎవరెవరు నిష్కల్మష నిర్నిబంధ జీవితాన్ని అభిలషిస్తారో — వారంతా
ఈ మహాద్భుత మారుత మలయసానువుల నధిరోహించండి.

కొండల గుండె అలజడుల ఆత్మను నేను, కొండల రాయుడను నేను,
నిశ్చలాత్మశక్తిని నేను, వెరుపెరుగని స్వేచ్ఛాజీవిని నేను.
నా ఏలుబడిలో ఏకమై నాతో అడుగు కలిపి నడవాలంటే
విధిగా విశుద్ధాత్ములై, ఆపదల కాపులై విరియాలి — వెల్లివిరియాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

(Ref: *Invitation by Sri Aurobindo*)

# యదార్థమైన నాయకుడు మనలోనే ఉన్నాడు

ప్రతి ఒక్క వ్యక్తి తన ప్రస్తుత జీవిత పరిధులను అధిగమించి ఒక ఉన్నతమైన, విస్తృతమైన జీవితంలో పాలుపంచుకొనునట్లు చేసే మహోన్నత చైతన్యం అతని అంతరంగంలోనే నిగూఢమై విలసిల్లుతుంది. నిజానికి, విశిష్టమైన వ్యక్తులయందు ఈ చైతన్యమే సర్వదా వారి జీవితాలను నిర్దేశించి, వారి ఉనికికి కారణభూతమైన పరిస్థితులతో పాటు వాటికి వారి వ్యక్తిగత ప్రతిస్పందనలను కూడ వ్యవస్థీకరిస్తుంది, దేనినైతే మానవుని యొక్క మానసిక చైతన్యం తెలుసుకొనలేదో, దేనినైతే అది నిర్వర్తించలేదో, దానిని ఈ చైతన్యం తెలుసుకోగలదు, నెరవేర్చగలదు. అది జీవి యొక్క కేంద్రంలో వెలుగుతూ తన కాంతిని ఉపరితలచేతనయొక్క చిక్కని పొరలగుండా ప్రసరింపజేసే దీపం లాంటిది.

శ్రీమాత 12:30

నాయకుడు నీలోనే ఉన్నాడు. నీవు చేయవలసిందల్లా అతనిని కనుగొనడమే, అతని గళం వినడమే. అది చేయగలిగితే ఇతరులు నీ మాటను వినకపోవడం అంటూ జరగదు. ఎందుకనగా అందరిలో స్వయంగా వ్యక్తమయ్యే గళం ఒకటి ఉంటుంది. ఆ గళమే, ఆ శక్తే నీలోనూ ఉంది. అది నీలో ఉన్న అనుభూతి నీకు కలిగి, దాని ఆవరణలో నీవు జీవించగలిగితే, అదే నీవు కాగలిగితే, అప్పుడు నీ నుండి వెలువడే ఒక్క మాట చాలు, ఇతరులలో సమాధాన గళాన్ని మేల్కొల్పుటకు.

శ్రీఅరవిందులు 1:664

దైవం తనకు తాను ఎవరిలో అభివ్యక్తమౌతాడంటే — గొప్ప ఆలోచనాపరుడు, కథానాయకుడు, ప్రజానాయకుడు, గొప్ప బోధకుడు, సాధువు, ప్రవక్త, మతస్థాపకుడు, ఋషి, ప్రజాహితుడు, గొప్ప కవి, గొప్ప కళాకారుడు, గొప్ప శాస్త్రజ్ఞుడు, నియంత్రణ గలిగిన తపస్వి, విషయాలను, సంఘటనలను, శక్తులను సరిదిద్దగలవాడు. చేసే పని, ఉత్తమ కవిత, సుందరరూపం, గాఢమైన ప్రేమ, ఉదాత్తమైన చర్య, దివ్యకార్యసిద్ధి., వీటన్నింటిలోను దైవం యొక్క కదలిక ఉంటుంది; ఒక విధంగా ఇది దైవసాక్షాత్కారం.

శ్రీఅరవిందులు 13: 360

నీ ఆత్మను అనుసరించు, నీ మనసును కాదు — సత్యానికి స్పందించే నీ ఆత్మను,

దృశ్యమానమైనవాటికి ఎగిరిగంతేసే నీ మనసును కాదు. దైవశక్తిని విశ్వసించు, ఆమె నీలోని దివ్యలక్షణాలను సడలించి, వాటినన్నింటిని దివ్యప్రకృతిగా మలుస్తుంది.

శ్రీఅరవిందులు 25:40

నీవు ఏది కోరుతావో, దానిని ప్రక్క నుంచి, దైవం కోరునదేదో తెలుసుకో; నీ హృదయం లోని భావోద్రేకాలు, లేక సహజంగా నీకుండే అభిప్రాయాలు, వేటినైతే సరైనవని, అవసరమైనవని సూచిస్తాయో, వాటిని విశ్వసించకు; గీతలో అర్జునుని మాదిరిగా వాటిని అధిగమించి, దైవం వేటిని సరైనవని, అవసరమైనవని నిర్ధారించాడో వాటిని తెలుసుకొనే ప్రయత్నం చెయ్యి. నీవు అభిలషించినదో లేక ఊహించినదో దక్కక పోయినా, నీవు విధిగా నిర్వర్తించవలసిన కర్తవ్యం, కర్మల ఫలితంగా, సరైనది, ఆవసరమైనది మాత్రమే దక్కుతుందనే ప్రగాఢ విశ్వాసం కలిగి ఉండు. ఈ లోకాన్ని పాలించే శక్తికి కనీసం నీకున్నంత వివేకమైనా ఉంటుంది. దాని నిర్వహణలో నీ సలహాగాని, నీ ప్రమేయంగాని ఎంత మాత్రము అవసరం లేదు. ఈ విషయం దైవం చూసుకుంటాడు.

శ్రీఅరవిందులు 16:418-19

నీ జీవితం నీ కివ్వబడింది కేవలం దైవకార్య నిమిత్తమేనని, దైవం అభివ్యక్తమవడానికి ఉపకరించడానికి మాత్రమే అనే భావన కలిగివుండు. ఒక్క పవిత్రతను, శక్తిని, వెలుగును, విశాలత్వమును, ప్రశాంతతను, దివ్యచైతన్య మహదానందాన్ని అవి నీ మనస్సును, జీవితాన్ని, శరీరాన్ని పట్టువదలక పరివర్తనను గావించుటను తప్ప, ఇతరమైనవాటిని వాంఛించకు.

శ్రీఅరవిందులు 25:9

కేవలం భక్తి మాత్రమే ఉన్నట్లయితే మేధోపరంగా మనిషి ఎదగడు. మరుగుజ్జుగానే ఉండిపోతాడు. అలాగే, కేవలం జ్ఞానం మాత్రమే ఉన్నట్లయితే భగవన్నాటకంలో ఒక అసమగ్ర నటుడిగానే మిగిలిపోతాడు. ఆత్మార్పణ గావించిన మనస్సులలో మాత్రమే దైవం భక్తి జ్ఞానాలను రెండింటిని వర్షిస్తాడు. ఒక బృహద్కార్యాచరణకు వీటిని జంటమూలాలుగా చేస్తాడు.

శ్రీఅరవిందులు 3:442

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

# సదా అభివృద్ధి, పురోగమనం

మొదటి నియమం — మనిషికి వ్యక్తిగత స్వప్రయోజనం లక్ష్యం కాకూడదు. అవసరమైన ముఖ్య లక్షణాలు, ధైర్యం, సాహసం, పట్టుదల.

అటుపిమ్మట, తాను తెలుసుకోవలసినదానితో పోలిస్తే, తనకు తెలిసినది స్వల్పమని, తాను చేయవలసినదానితో పోలిస్తే, చేయగలిగింది ఏమీ లేదని, తాను విధిగా ఉండవలసినదానితో పోలిస్తే, తానున్న స్థితి శూన్యమనే ఎరుక కలిగి ఉండాలి.

తన స్వభావంలో ఉన్న లోపమేమిటో దానిని గమనించాలని, తనకు ఇంతవరకు తెలియనిదానిని తెలుసుకోవాలని, తాను ఇంతవరకు చేయ శక్తిలేనిదానిని చేయగలగాలనే దృఢసంకల్పం కలిగి ఉండాలి.

తనకు వ్యక్తిగత వాంఛలు లేని కారణంగా ప్రసన్నమయ్యే వెలుగు, ప్రశాంతతతలో నిరంతరం పురోగమించాలి.

'సర్వదా అభివృద్ధి, పురోగమనం' అనే సూక్తిని ఒక పాటించవలసిన కార్యక్రమంగా పరిగణించాలి.

ఏకైక లక్ష్యం కలిగి ఉండాలి: దైవాన్ని అభివ్యక్తపరచుటకుగాను అతనిని తెలుసుకోవాలి.

పట్టువదలకు, నీవు నేడు నిర్వర్తించలేనిదానిని రేపు నిర్వర్తించగలవు.

మూలం శ్రీమాత 16:428

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

సుస్థిరమగు సంకల్పం అస్థిరకాలం కలుస్తాయి.
అయినా లోకం పోట్లకు ఆ విజేత తలదించడు.
పెరుగుతున్న చీకట్లో నెమ్మదిగా వేస్తాడడుగులు.
లక్ష్యం దూరం అయినా నడకను వేగిరపరచడు.
చీకటిలో వినిపించే కేకలు ఖాతరు చేయడు.
చిల్లరదేవుళ్ళ సాయమాసించడు ఇంచుకైన
నిర్వికల్ప లక్ష్యం పై నిలుపుతాడు తన దృక్కులు.

శ్రీఅరవిందులు 29:449

# మార్గదర్శిగా ఉండు

ప్రప్రథమంగా ప్రతి ఒక్కరు ఎవరి బాధ్యతను వారే వహించాలి. ఇతరులకు సహాయపడాలని అభిలషిస్తే, మార్గదర్శకంగా ఉండుట ద్వారానే సమర్థవంతంగా సహాయపడగలరు. మనఃస్ఫూర్తిగా సద్భావనతో మెలిగేవారందరికి అద్భుతమైన సార్థకతగల దైవకృప సర్వదా లభిస్తుంది.

శ్రీమాత 17:377

సమిష్టి జీవనం సాగిస్తున్నప్పుడు, నీవు సర్వదా ఒక దివ్యమార్గదర్శిగా నుండాలి. దివ్యజీవనంపై అవగాహన కలిగించి, వారు ఆ మార్గంలో ప్రవేశించడానికి అవకాశం కల్పించేవిధంగా నుండాలి. అంతకు మించి మరేమీ కాదు: వారు అభివృద్ధిచెందాలనే ఆశ కూడ నీకుండ కూడదు; ఎందుకంటే అది కూడ నీ అభిప్రాయాన్ని కొంతవరకు వారిపై రుద్దినట్లవుతుంది.

నీలోని దివ్యత్వంతో నీవు నిశ్చయంగా మమేకమగునంతవరకు, బయటి ప్రపంచంతో నీకుండే సంబంధాల విషయంలో, ఎవరైతే స్వయంగా అలాంటి అనుభవం పొంది ఉన్నారో, వారి ఏకగ్రీవ సలహా ప్రకారం నడుచుకోవాలి.

దేని వలన కూడ కష్టపడకుండా, ఇతరులను కష్టానికి గురిచేయకుండా, వీలయినంతవరకు ఎవరినీ బాధించకుండా మెలగడం, ఒక నియమంగా పెట్టుకుని, నిరంతరం దయార్ద్రహృదయం కలిగి ఉండాలి.

శ్రీమాత 2:103

నాయకులు ఎప్పుడు ఆదర్శప్రాయులుగ ఉండాలి. వారి అనుయాయూలు ఎలాంటి నీతినియమాలు పాటించాలని వారు అభిలషిస్తారో, అట్టి లక్షణాలనే వారు కూడ కలిగి ఉండాలి. వారు వివేకము, క్షమ, సహనం, కారుణ్యం, సానుభూతి, స్నేహపూరక ఆదరణలతో నిండి ఉండాలి. ఈ లక్షణాలను తమకు సన్నిహితులను సమకూర్చుకోవాలనే స్వాతిశయంతో కాక ఇతరులను అర్థం చేసుకుని, వారికి సహాయపడే గొప్ప మనస్సు కలిగి ఉండాలి. ఒక నిజమైన నాయకుడు తనను తాను మరచి, తన స్వంత ఇష్టాయిష్టాలను విస్మరించడం తప్పనిసరి.

శ్రీమాత 13: 169-70

# నిజమైన నాయకుడు పాటించవలసిన నియమాలు

## తనను తాను మరువగలగాలి:

తనను తాను మరువగలగడం నిజమైన నాయకుడికి ఉండవలసిన అత్యావశ్యక నియమాలలో ఒకటి.

## ఇతర నియమాలు:

స్వప్రయోజనాలను విస్మరించాలి. తన కోసం దేనినీ ఆశించకూడదు. కేవలం సంఘశ్రేయస్సును, సమిష్టి శ్రేయస్సును, తన పైనే ఆధారపడియున్న వారి శ్రేయస్సును ఆశించాలి. ఆ ఏకైక లక్ష్యాన్నే మనసులో నిలుపుకొని, తన కార్యాచరణలో వ్యక్తిగత ప్రతిఫలాన్ని ఆశించకూడదు.

ఆ విధంగా ఒక చిన్న బృందానికి నాయకుడైనవాడు క్రమక్రమంగా ఒక పెద్ద సంఘ నాయకుడిగా, ఒక దేశనాయకుడిగా, ఒక సమిష్టి నాయక పాత్రను పోషించే స్థాయికి ఎదగవచ్చును. ఇదంతా ఒక ప్రధానమైన శిక్షణాక్షేత్రంగా ఉంటుంది. నిజానికి మేము ఇక్కడ ప్రయత్నించింది, ప్రయత్నం కొనసాగిస్తున్నది అందుకోసమే — వీలయినంత త్వరలో ప్రతి ఒక్కరు ఒక నిజమైన నాయకుడిగ ఎదగగలుగుటను నేర్చుకొనే వీలుగా ఒక బాధ్యతను — చిన్నదిగాని, పెద్దదిగాని — వారికి అప్పగించాలని మాఆశయం.

నిజమైన నాయకుడు కావాలంటే నిష్పాక్షికంగా ఉండగలగాలి. స్వార్థప్రేమను, స్వార్థపూరిత చలనాలను విసర్జించాలి. ముఖ్యంగా నాయకుడు తన అహాన్ని నియంత్రించుకోగలగాలి.

శ్రీమాత 9:81

## అందరిలో పనిచేసే దైవం గురించి విశాల దృక్పథం కలిగి ఉండాలి:

ప్రతి ఒక్కరు తెలిసో తెలియకో విశ్వశక్తికి ఒక ఉపకరణమే. అంతరంగమందు దైవ ఉనికి విషయములో తప్ప మనిషి చేసే ఒక చర్యకు మరో చర్యకు, ఒక విధమైన సాధనకు మరోవిధమైన సాధనకు మధ్య గణనీయమైన వ్యత్యాసం ఏమీ కానరాదు. జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్యనున్న తేడా భగవత్ కృపపై ఆధారపడి

ఉంటుంది. దైవశక్తి ప్రభావం, అది కోరుకున్న దిశకే ప్రసరిస్తూ, నేడు ఒక దానిని రేపు మరొక దానిని మంత్రశక్తితోనో లేక దైవశక్తితోనో పూరిస్తుంది. కుమ్మరి ఒక మట్టిపాత్రను, మరొక పాత్రకన్న మిన్నగ తీర్చగలిగితే ఆ యోగ్యత కుమ్మరిది గాని, పాత్రది కాదు. మన మనోవైఖరి "ఇది నా శక్తి" లేక "నాలో దైవశక్తి ఉన్నది చూడు" అనే మాదిరిగ కాక "ఒక దైవశక్తి ఈ మనసులోను, దేహంలోను పనిచేస్తున్నది; అందరిలోను, జంతువులలోనూ, చెట్టు చేమలలోను, లోహాలలోను చైతన్యమూ, జీవం ఉన్నవాటిల్లోను, అచేతనంగా, జడంగా కనిపించే వాటిల్లోను, అదే శక్తి పనిచేస్తుంది" అను మాదిరిగ నుండాలి. అందరిలోను, ఈ సమస్త ప్రపంచంలోను పనిచేస్తున్న ఆ దైవమే, దైవకార్యాచరణకు, ఆత్మసాక్షాత్కారానికి కూడ సమానంగా ఉపకరించగలడు అనే విశాలభావనను మనం పరిపూర్ణంగ అనుభవించగలిగితే, అది మనలోని రాజసిక అహంకారాన్ని పారద్రోలుతుంది. అంతేగాక, నేను, నాది అనే సాత్విక ఇంద్రియ జ్ఞానం కూడ మన ప్రకృతి నుండి అంతరించుట ఆరంభమౌతుంది.

శ్రీఅరవిందులు 20: 238

## సత్యాన్ని అంటిపెట్టుకుని ఉండాలి:

విజయంపై కన్నా సత్యంపైన ఎక్కువ ఆసక్తి కనబరచు.

శ్రీమాత 14:206

సత్యం ఒక రాతి పునాది. దానిపైనే ఈ ప్రపంచ నిర్మాణం జరిగింది — "సత్యేన తిష్టతే జగత్" — అసత్యం ఎన్నటికి శక్తికి యదార్థమైన మూలం కాలేదు. అసత్యం ఎప్పుడైతే ఒక ఉద్యమానికి మూలమౌతుందో, ఆ ఉద్యమం భగ్నం కావాలని ముందే నిర్ణయించబడింది. ఉద్యమం, సత్యాన్ని ఆధారంగా చేసుకొని కొనసాగినప్పుడే లౌక్యముతో కూడిన వ్యవహారం దోహదపడగలదు. లౌక్యాన్ని మాత్రమే మూలసూత్రంగ పెట్టుకుంటే, అది జీవనవిధాన నియమావళిని అతిక్రమించడమౌతుంది.

శ్రీఅరవిందులు 1:706

సర్వకాల సర్వావస్థలలో సత్యసంధతను మించిన ధైర్యం మరొకటి లేదు.

శ్రీమాత 14:182

## జాగరూకత కలిగి ఉండాలి:

జగరూకత అనగా మెలకువతో నుండుట, తన రక్షణలో తానుండుట, నిజాయితీగా నుండుట — ఆకస్మిక పరిణామాలకు చలించకుండుట....

జాగరూకతతో నుండుట అనగా కేవలం నిన్ను నిమ్నస్థాయికి దిగజార్చేదానిని ఎదిరించడం మాత్రమే కాదు. అన్నింటిని మించి, వృద్ధిచెందుటకు కలిగిన ఏ అవకాశాన్ని కూడా చేజార్చుకోకుండ, ఒక బలహీనతను అధిగమించుటకు దొరికిన ఏ అవకాశాన్ని కూడ వదలుకోకుండ, ఒక ప్రలోభాన్ని తట్టుకొని నిలబడుటకు, ఒక దానిని నేర్చుకొనుటకు, ఒకదానిని సరిదిద్దుటకు, ఒకదానిపై ఆధిపత్యం పొందుటకు కలిగే ఏ అవకాశాన్ని కూడ వదులుకోకుండా ఉండుట. నీవు జాగరూకుడవై ఉన్నట్లయితే, ఏ పనినైతే నెరవేర్చడానికి మామూలుగ సంవత్సరాలు పడుతుందో, ఆ పనిని కొన్ని రోజులలోనే నెరవేర్చగలవు. నీవు జాగరూకుడవై ఉన్నట్లయితే, నీ జీవితంలో తటస్థించే ప్రతి సందర్భాన్ని, ప్రతి కార్యక్రమాన్ని, ప్రతి కదలికను లక్ష్యానికి చేరువ కాగలిగే అవకాశంగా మార్చుకుంటావు.

శ్రీమాత 3: 202

## తన బలహీనతలను గుర్తించాలి:

తన బలహీనతలను, తన బూటకపు కదలికలను గుర్తించి వాటిని విసర్జించుట, వాటి బారినుండి విడుదల నొందుటకు సరైన మార్గం. తాను స్వయంగ విషయాలను శాంతచిత్తంతో, ప్రశాంతమైన ప్రాణికంతో గమనించగలిగే వరకు, తననుతాను విమర్శించుకోవాలి తప్ప, ఇతరులెవ్వరిని విమర్శించకుండుట ఒక అత్యుత్తమ సూత్రము. అంతేగాక, బాహ్యరూపురేఖల ఆధారంగ నీ మనస్సును తొందరపాటు అంచనాలకు రానివ్వకూడదు. నీ ప్రాణికసత్తాను వాటి కనుగుణంగ ప్రవర్తించనీయ కూడదు.

నిరంతరం నిశ్చలంగా ఉండి సమత్వభావంతో ఉపరితల చేతన యొక్క కలవరపాట్లను పరిశీలనాత్మక దృష్టితో గమనించి, వాటిని మార్పుచేయుటకు ప్రయత్నించగల స్థానం ఒకటి నీ అంతఃసత్తాలో ఉంది. ఆ అంతఃసత్తా యొక్క

ప్రశాంతతలో జీవించడం నేర్చుకోగలిగితే, నీ సుస్థిర పునాదులను నీవు కనుగొలగలవు.

శ్రీఅరవిందులు 24: 1684

## ఆత్మనిగ్రహం కలిగి ఉండాలి:

1. ఇతరులను నీవు నియంత్రించడానికి ముందు నీపై నీవు సంపూర్ణ నియంత్రణను కలిగి ఉండుట తప్పనిసరి.
2. ఇష్టాయిష్టాలకు చోటివ్వకూడదు. ఒకరిని యిష్టపడి మరొకరిపై అయిష్టత కూడదు. అందరితో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.
3. ఓర్పుతో, సహనంతో మెలగాలి.

తప్పనిసరి అయినదేదో అది మాత్రమే మాట్లాడాలి. అంతకు మించి కాదు.

శ్రీమాత 15: 59

స్థిమితంగా నుండాలి. ఓర్పు వహించి ఉండాలి. ఎప్పుడూ ఆగ్రహంచెందకూడదు. ఇతరులపై ఆధిపత్యం చెలాయించాలంటే, నీపై నీవు ఆధిపత్యం కలిగి ఉండాలి.

శ్రీమాత 12: 195

## పరిపూర్ణమైన నిజాయితీ కలిగి ఉండాలి:

పరిపూర్ణమైన నిజాయితీ కలిగి ఉండాలంటే, ఎలాంటి అభిమానం, ఎలాంటి కోరిక, ఎలాంటి ఆకర్షణ, ఎలాంటి అయిష్టత, ఎలాంటి సానుభూతిగాని, అనిష్టతగాని, ఎలాంటి అనురాగం, ఎలాంటి అసహ్యం లేకుండ ఉండుట తప్పనిసరి.

అన్ని విషయాలు సక్రమంగా ఉన్నట్లు ఒక సంపూర్ణమైన, సమగ్రమైన దృష్టి కలిగి ఉండాలి. అన్నింటిపై సమవైఖరి కలిగి ఉండాలి. అదే యదార్థదృష్టికి ఉండవలసిన వైఖరి. ఇలాంటి నియమావళిని పాటించుట మనిషికి క్లిష్టమైన పని. తనను తాను దివ్యజీవిగ రూపాంతరమొందుటకు నిశ్చయించుకుంటే తప్ప, తనలోని ఈ వైరుధ్యాల నుండి విముక్తి నొందుట దాదాపు అసాధ్యం. అయినప్పటికీ వీటిని తనలో కొనసాగించి నంతవరకు అతడు పరిపూర్ణ నిజాయితీపరుడు కాలేడు. మానసిక ప్రాణికగమనాలే కాక శారీరక గమనాలు సైతం బూటకమైనవిగా మారతాయి. నేను శారీరక గమనాల గురించి ముఖ్యంగా చెప్తున్నాను. ఎందుకనగా, ఇంద్రియాల పనితీరు కూడ వక్రీక రిస్తుంది. ప్రాధాన్యత ఉన్నంతవరకు వేటిలోనైనా వాస్తవికతను చూడలేవు, వినలేవు,

రుచిచూడ లేవు, తెలుసుకోలేవు. నిన్ను సంతోషపెట్టేవి లేక సంతోషపెట్టనివి, నిన్ను ఆకర్షించేవి లేక రోత పుట్టించేవి ఉన్నంతవరకు విషయాల వాస్తవికతకను నీవు గమనించలేవు. వాటిపై నీ స్పందన, నీ ఇష్టాయిష్టాల రీత్యా వాటిని అర్థం చేసుకుంటావు. అనుభూతులు, ఆలోచనలు ఏవిధంగానైతే చెదిరిపోతుంటాయో, అదే విధంగా ఉపకరణాల లాంటి ఇంద్రియాలు కూడ చెదిరిపోతాయి. అందువలన నీవు చూసేది, స్పర్శించేది, అనుభవించేది, ఆలోచించేది అంతా రూఢిగ నమ్మాలంటే నీలో ఒక సంపూర్ణమైన ఉదాసీనతా భావం కలగాలి. నిజానికి ఇదిఅంత సులభమైనదేం కాదు. కాని అంతవరకు నీ అవగాహన పూర్తిగా వాస్తవం కాలేదు.

శ్రీమాత 8: 398

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

# సమస్య — పరిష్కార మార్గాలు

## పునరాలోచన

మీలో చాలామంది ప్రాణి ఉపరితలస్థాయిలోనే జీవిస్తూ వుంటారు. బాహ్య ప్రభావాలకి గురవుతూ వుంటారు. మీరు మీ శరీరానికి బాహ్యంగా యెలా కనిపించాలనుకుంటారో అలా కనిపిస్తూ జీవిస్తారు. కాని యెప్పుడైనా మీ కిష్టంలేని వ్యక్తి సర్గిగా అలాగే కనిపించడం చూస్తే మీరు తలకిందులవుతారు. ఈ బాధంతా ఎందువల్ల అంటే మీలో మీరు ఒక్కడుగు వెనక్కిపోయి ఆలోచించకపోవడం చేత. ఎప్పుడూ కూడా మీరు ఏ విషయాన్నయినా మీలో మీరు పునరాలోచించాలి. ఏ విషయాన్నైనా లోతుగా ఆలోచించడం నేర్చుకోండి. ఒక్కసారి వెనక్కిపోయి ఆలోచిస్తే క్షేమంగా వుంటారు. బాహ్యప్రపంచంలో కదలాడుతుండే శక్తులకి మిమ్మల్ని మీరు అప్పగించుకోకండి. ఏదైనా వెంటనే చెయ్యవలసివచ్చినా సరే ఒక్క క్షణం ఆగి, ఆ విషయాన్ని మళ్ళీ జాగ్రత్తగా ఆలోచించి చూడండి. మీకే ఆశ్చర్యం కలిగేలా ఎంత వేగంగా, ఎంత విజయవంతంగా ఆ పని చెయ్యగలుగుతారో మీకే తెలుస్తుంది. ఎవరైనా మీ మీద కోపంగా వున్నారనుకోండి. ఆ కోపప్రకంపనల్లో చిక్కుకోకుండా వెనక్కి తగ్గండి. ఆ కోపం ఆధారం దొరకక దానంతటదే చల్లారిపోతుంది. నిరంతరం మీ ప్రశాంతతకి భంగం కలగకుండా చూసుకోండి. ప్రశాంతతను పోగొట్టే ఆకర్షణలను

అరికట్టండి. జాగ్రత్తగా పునరాలోచన లేకుండా ఏ నిర్ణయం తీసుకోకండి. అలాగే పునరాలోచన లేకుండా ఒక్క మాటైనా ఎప్పుడూ మాట్లాడకండి. జాగ్రత్తగా పునరాలోచన లేకుండా యే కార్యాచరణకి దిగకండి. సామాన్య ప్రపంచానికి చెందినదంతా అశాశ్వతము, క్షణికము. అందుచేత అందులో మనం ఆందోళనపడవలసినంత గొప్పదేమీ వుండదు. ఏది నిత్యము, శాశ్వతము, అవినాశము, అనంతము అవుతుందో, అది నిజంగా మనం పొందవలసినది, జయించవలసినది, సంపాదించవలసినది. అదే దివ్యకాంతి, దివ్యప్రేమ, దివ్యజీవనం. అదే అన్నిటినీ మించిన దివ్యశాంతి, సమగ్ర ఆనందం, భూమి మీద సర్వాధిపత్యంతో కూడిన మకుటాయమానమైన ఒక దివ్య పరిపూర్ణ దర్శనం. వస్తువుల యొక్క సాపేక్ష లక్షణాన్ని గ్రహించగలిగినప్పుడు అప్పుడు ఏదేమైనా ఒక్కడుగు వెనక్కి వేసి ఆలోచించు. నీవు ప్రశాంతంగా వుండ గలవు. దివ్యశక్తిని ఆవాహన చేసి సమాధానం కోసం నిరీక్షిస్తావు. సరిగ్గా అప్పుడు ఏం చెయ్యాలన్నది నీకు అవగతమవుతుంది. అందుచేత ఒక విషయం గుర్తుంచుకో! ముందుగా నువ్వు అత్యంత ప్రశాంతంగా ఉండగలిగితే తప్ప జవాబును అందుకో లేవు.

## ఏకాగ్రత

నీ ఏకాగ్రతాశక్తిని సంపూర్ణంగా సాధించగలిగితే నీవు పరిష్కరించలేని సమస్యే వుండదు. అంటే అంకగణిత సమస్యలు కావు (నవ్వుతూ) జీవితాన్ని గడుపుటలో నుండే సమస్యలు. తీసుకోవలసిన నిర్ణయాలకు సంబంధించిన సమస్యలు, పరిష్క రించడం అవసరమయిన మానసిక సమస్యలు. ఏ ఒక్కటీ కూడా ఏకాగ్రతా శక్తి ముందు నిలువలేవు.

ఇంకా చెప్పాలంటే నిజానికి యిది చాలా సౌకర్యవంతమయిన మార్గం. ఒక స్థిరబిందువుని కేంద్రంగా తీసుకుని ఆ బిందువు వైపే నిశ్చలంగా చూస్తూ — ఎంత నిశ్చలంగా అంటే ఒక దశలో తనే ఆ బిందువు అయిపోయినంతగా. ఇక పైన బిందువును చూసేవారుండరు. తానే ఆ బిందువు అయిపోతాడు. అప్పుడు తగినంత బలంగా, ప్రశాంతతతో ఏదీ నీ ఏకాగ్రతను భంగపడనీయకుండా, ఆ పద్ధతి కొనసాగిస్తే హఠాత్తుగా ఒక మార్గం కనుక్కోగలవు. దాని ద్వారా నువ్వు గమ్యం చేరతావు. అప్పుడు దివ్యదర్శనం సిద్ధిస్తుంది.


**సమస్యను భగవంతుడి ముందు వుంచు:**

సమస్య అనబడేది ఒకటి నీ ముందు నిలిచింది. నువ్వేం చెప్పాలి? ఏం చెయ్యాలి? ఎలా పనిచెయ్యాలి? నువ్వు చెయ్యవలసిందేమీ లేదు. ముమ్మాటికీ ఏమీ లేదు. కేవలం పరమాత్మతో నివేదించుకో. 'ఇది ఇలా ఉంది చూడు' అని — అంతే. అది చాలు. ఆ తరవాత హాయిగా ప్రశాంతంగా ఉండు. అప్పుడు అనాలోచితంగా తనంతట తాను, పునరాలోచన లేకుండా, ఏ ఉద్దేశం కూడా ఏమీ లేకుండా, చిన్న ప్రయత్నం కూడా చేయకుండానే చెయ్యవలసింది చేస్తావు. అనగా, ఆ పని భగవంతుడే చేస్తాడు. నువ్వెంత మాత్రం కాదు. అతడే చేస్తాడు. అతడే పరిస్థితులన్నీ చక్కబరుస్తాడు. అవసరమయిన మనుష్యుల్ని ఏర్పాటుచేస్తాడు. నీవు మాట్లాడవలసిన మాటలు నీ నోటికి, నువ్వు వ్రాయవలసిన రాతలు నీ కలానికి అందిస్తాడు. అంతే. అంతా, అంతా అతడే చేస్తాడు. నువ్వు నిమిత్తమాత్రుడివి. నువ్వు చెయ్యవలసిందింకేమీ లేదు. హాయిగా ఆనందంగా జీవితం గడపడం తప్ప.

## శ్రీమాత ఆశించిన సమగ్ర పరిణామము

**ఈ భూమి మీది పదార్థప్రపంచంలో నేను తేవాలనుకున్న పరిణామాలు:**

1. సమగ్ర దివ్యచైతన్యం
2. పరిపూర్ణ దివ్యజ్ఞానం, సర్వజ్ఞత
3. అజేయమైన, ఆపలేని, తప్పించుకోలేని సర్వతోముఖ శక్తి
4. పరిపూర్ణమైన, నిత్యమైన, దృఢమైన ఆరోగ్యం; కలకాలం కొనసాగే పునరుజ్జీవన శక్తి.
5. నిత్య యవ్వనం, స్థిరమైన పెరుగుదల, అవిచ్ఛిన్నమైన ప్రగతి.
6. అనన్యసౌందర్యం, సంశ్లిష్టము సంపూర్ణము అయిన సామరస్యం.
7. తరగని అసమాన సంపదలు, ప్రపంచంలోని సకల సంపదల మీద అదుపు.
8. నయం చేసి సంతోషాన్నివ్వగలిగిన దివ్యవరం.
9. అన్ని ప్రమాదాల నుండి, అన్ని ప్రతికూలదాడుల నుండి అభేద్యమయిన రక్షణ.
10. అన్ని రంగాలలోను, అన్ని కార్యకలాపాలలోను సమగ్రమైన భావప్రకటనాశక్తి.



ఆత్మగత విషయాన్ని మానవ మనుగడ కోసం
దేవుని చదరంగంలో విధివ్రాతకు జోడు చేసి
పాచికలేసిందామె గెలుపోటమి లెక్కించక.
శరణంటు లొంగిపోవు జన్మ కాదామెది.
దారి చూపి ముక్తి నొసగు మహిమాన్వితమామె పాత్ర.

శ్రీఅరవిందులు
అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

11. వాక్చాతుర్యం, అందరూ సమగ్రంగా అర్థం చేసుకోగల శక్తిసంపద.
12. దైవకార్య నిర్వహణకు అవసరమయినవేవైతే ఉన్నాయో అన్నీ సమకూర్చుట.

శ్రీమాత 13: 41

నేను కోరేది:

1. వ్యక్తిగతంగా పరమాత్మ యొక్క శాశ్వత సమగ్ర అభివ్యక్తిగా నుండుట.
2. అధిమానస విజయం, దర్శనం మరియు రూపాంతరం అన్నీ ఒకేసారి సంభవం కావాలి.
3. వర్తమానంలోను మరియు భవిష్యత్తులోను బాధలన్నీ లోకాల నుండి శాశ్వతంగా మాయం కావాలి.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

## దర్శకత్వం — వ్యవస్థీకరణ

ఒక నాయకుని నైపుణ్యము, శక్తి, నిర్వాహకుడిగా అతడిని అనుసరించేవారిలో నమ్మకాన్ని, విధేయతను కలిగించే నేర్పు మీద ఆధారపడి ఉంటుంది. ఇది సామూహికంగా చేసే ఏ కార్యాచరణలోనైనా అత్యంత ముఖ్యమైన విషయం. అయితే ఎవరు సమిష్టి కార్యంలో ఒకే శరీరంగా, ఒకే మనసుగా, కలిసి పనిచేయడంలో తర్ఫీదు పొందరో, వారు ఈ లక్షణాన్ని అభివృద్ధి చేసుకోలేరు. ఈ తర్ఫీదులోని కఠిన నియమాలు, క్రమశిక్షణ, వ్యక్తిగతస్వేచ్ఛకు విరుద్ధమైనవి కాకపోగా, ఆ స్వేచ్ఛ యొక్క సదుపయోగానికి అవసరమైన స్థితి కారకాలు. స్వేచ్ఛకు క్రమపద్ధతి విరుద్ధం కాకపోగా, దాని యోగ్యతకు, భద్రతకు ఎంత అవసరమో అదే విధంగా, దానిని సద్వినియోగపరచుటకు, సమిష్టి కార్యాచరణకు ఈ నిబంధన తప్పనిసరి. వివిధ స్థాయిల్లో ఒక బృందంగా పనిచేయడానికి ఇది ముఖ్యమైన ఆవశ్యకత. బృందవాయిద్య గోష్టిలో, సంగీత సారథ్యం వహించిన వ్యక్తిని అనువర్తించకుండా, ఎవరి ఇష్టానుసారం

వారు వాయిస్తే, ఆ కచ్చేరి ఏ విధంగా రసాభాస అవుతుందో ఆ విధంగా ఆ కార్యం చెడుతుంది.

శ్రీఅరవిందులు

ప్రతి బృందం, సత్యసంధతగల బృందమైతే — అంటే వ్యక్తిగత సామర్థ్యం ప్రకారం ఏర్పడినపుడు — తప్పనిసరిగా వ్యవస్థీకరణ జరగాలి.

అయితే వ్యవస్థీకరణను సాధించడానికి కొన్ని గమనించదగ్గ అడ్డంకులున్నాయి.

1. మొదటిది, ఆ బృందమే అసంపూర్ణంగా ఉన్నపుడు అనగా ఆ వ్యవస్థీకరణకు అవసరమైన సభ్యులు లేనపుడు, కొన్ని విధులు, మధ్యవర్తుల ద్వారా జరిగే పనులు ఆగిపోయినపుడు.
2. కొందరు సభ్యులు వారికి కేటాయించిన పనికి పూర్తిగా కాని, పాక్షికంగాగాని ఇష్టపడకపోవడం, వారికిచ్చిన స్థానాన్ని తిరస్కరించడం, క్రమశిక్షణారాహిత్యం. ఎప్పుడైతే క్రమబద్ధత, ఐకమత్యము స్థాపించబడుతాయో, అప్పుడు వ్యవస్థీకరణ సహజంగా, దానంతటఅదే ఏర్పడుతుంది.

శ్రీమాత

ప్రశ్న: *దైవం తన అభివ్యక్తి కోసం ఒక వ్యక్తినే ఎన్నుకుంటాడా లేక అనేకమందిని ఎన్నుకుంటాడా?*

అనేకమందిని ఎన్నుకుంటాడు.

కాని ఇక్కడ కూడా ఒక వ్యవస్థీకరణ ఉంది. నిజమైన వ్యవస్థీకరణను అర్థం చేసుకోకపోతే, ఆధ్యాత్మిక జీవితం గురించి ఏమీ అర్థం కాదు.

ఈ కాలంలో ఇది సంప్రదాయం కాదు. మానవ ఆలోచన దీన్ని ఇష్టపడదు. అయితే ఆధ్యాత్మిక కోణంలో చూసినపుడు వ్యవస్థీకరణ స్వాభావికంగా, సహజంగా, ఏ తగాదా లేకుండా ఉంటుంది. నిజమైన వ్యవస్థీకరణలో ప్రతివారికి వారి స్థానం ఉంటుంది.; ప్రతి ఒక్కరికి వారిక తగ్గ స్థానం వారి వ్యక్తిగత నిబద్ధత ప్రకారం లభిస్తుంది. అనగా, ప్రతి అంశం దాని ఉచిత స్థానంలో ఉన్నపుడు తన స్థానం లోనున్న ఆ దైవంతో పరిపూర్ణ సంబంధం కలిగి ఉంటుంది. అయినప్పటికీ, మొత్తాన్ని చూసినపుడు, సమగ్రత సంతరించుకున్న వ్యవస్థ కూడ ఉండి తీరుతుంది. ఆధ్యాత్మిక స్థాయిలో జీవితాన్ని అర్థంచేసుకోవాలంటె ఈ విషయాన్ని ముందుగా అర్థం చేసుకోవాలి. అది అంత సులభమైన విషయము కాదు.

ప్రతి వ్యక్తి తాను స్వయంగా దైవం యొక్క సంపూర్ణ అభివ్యక్తి కాగలడు, అయితె దానికున్న షరతు — అతడి స్థానం అతడు తెల్సుకుని దానికి కట్టుబడి ఉండాలి....

*ప్రశ్న: అయితే వ్యవస్థీకరణ అంటే ఏమిటి?*

వ్యక్తిగత స్వభావానుసారంగా, కార్యక్రమాలను ఏర్పాటు గావించి, వాటి నిర్వహణాక్రమంలో ఆతని వ్యక్తిత్వ అభివ్యక్తత.

ఈ వ్యవస్థీకరణకు పోలికలు వెతకడానికి మనం ప్రయత్నిస్తూనే ఉంటాం. అయితే అవి మనకు పనికిరావు. ఎందుకంటె భౌతికంగా మనకి తెలిసిన ఏ విషయాలు దాన్ని సరిగ్గా వివరించలేవు. మనం ప్రతిసారి ఒకటి ఎక్కువ, మరొకటి తక్కువ అన్న దృష్టితోనే చూస్తాం. ఉదాహరణకు కొందరు దీనిని మానవశరీరంతో పోల్చి చూపారు; అయితే తల పైన ఉంది కాబట్టి గొప్పది, పాదాలు నేల మీద క్రింద ఉంటాయి కాబట్టి తక్కువ అన్న భావన కలుగుతుంది. అందుకే ఈ పోల్చడం ఒక అర్థంలేని పని.

*ప్రశ్న: ప్రతి అంశం ఏకకాలంలో దైవం యొక్క సంపూర్ణ అభివ్యక్తి అయినప్పుడు, వ్యవస్థీకరణ గురించి ఎలా మాట్లాడగలం?*

ప్రతి అంశం దైవంతో సూటిగా ఒక పరిపూర్ణ సంబంధాన్ని కలిగి ఉంటుంది.


*ప్రశ్న: అవి సంపూర్ణంగా దైవంగా మారలేవా?*

అవును, అన్నీ దైవపరమైవిగా మారగలవు. అయితే అది దైవం యొక్క సంపూర్ణత్వంగా కాదు, ఎందుకంటె దైవం సర్వం తానె అయి ఉంటారు. నువ్వు దైవం నించి ఓ చిన్న భాగం తీసి 'ఇది దైవం' అని చెప్పలేవు. అయినా ఒకరి ఆధ్యాత్మిక చైతన్యంలో వారికి ఒక సంపూర్ణ సంబంధం దైవంతో ఉంటుంది. అంటే ప్రతి ఒక్కరు ఎంత పూర్ణంగా, దైవంగా నుండగలరో అంతమేరకే ఉండగలరు. అయితే పూర్తిగా దైవంలా రూపొందటానికీ, మొత్తం భగవంతుడు అవసరమౌతాడు. సరిగ్గా ఇదే వ్యవస్థీకరణ యొక్క సారాంశం. కాని ప్రతి ఒక్కరు తమలో తాము పరిపూర్ణులై సంపూర్ణంగా ఉంటారు కాబట్టి ఎక్కువ, తక్కువ అన్న భావన ఉండదు.

*ప్రశ్న: శ్రీమాతా! వ్యవస్థీకరించబడిన బృందం అని మీరు ఏ భావంలో అన్నారో నా కర్థం కాలేదు?*

వ్యవస్థీకరించబడిన బృందం అనగా అందులో జరిగే కార్యాచరణ, విధుల

నిర్వహణ, క్రమబద్ధంగా వ్యక్తుల యొక్క సమర్థతని బట్టి ఏర్పాటు చేయబడుతుంది. దానికి కేంద్రస్థానంలో ఉండి ఒకరు నాయకత్వం వహిస్తారు. సైనికదళాల వ్యవస్థ దీనికి ఉదాహరణ. ఇక్కడ సనాతన సాంప్రదాయాలకు సంబంధించిన వ్యవస్థీకరణ గురించిన చిత్రముంది.



1— 4 — 8 —16

ఆ విధంగా

శ్రీమాత 16: 329

ఎవరికి వారు, వారికిష్టమొచ్చినట్లు పనిచేసుకుంటూ పోతె, ఆ సంస్థ మొత్తం విచ్ఛిన్నమౌతుంది.

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

## బాహ్యాంతర్గతముల క్రమశిక్షణ — వ్యవస్థీకరణ

అంతర్గతంగాను, బయటా క్రమశిక్షణ పాటించకపోతే జీవితంలో, ఆధ్యాత్మికంగాను, భౌతికముగానూ కూడా ఏమీ సాధించలేరు. ఎవరైనా చాలా ఉపయోగకరమైనవాటినీ, అందమైనవాటినీ తయారుచేయగలిగారంటే వారు క్రమశిక్షణ పాటించటమెలాగో బాగా తెలిసినవారై యుంటారు.

శ్రీమాత, 16:123-24

క్రమశిక్షణ లేకపోతే సరైన పని ఏదీ సాధ్యం కాదు.
క్రమశిక్షణ లేనప్పుడు సరైన జీవితమే సాధ్యపడదు.

శ్రీమాత, 13:168

వ్యక్తిగతమైన క్రమశిక్షణ, సామూహిక క్రమశిక్షణ, దైవసంబంధమైన క్రమశిక్షణలు పాటించకపోతే గణనీయమైన సృజనాత్మక క్రియలేవీ సాధ్యం కావు.

శ్రీమాత, 13:204

పనిలో ఒక పద్ధతీ, సామరస్యమూ ఉండాలి. అతి సాదాసీదాగా కనిపించే పనినైనా అత్యంత పరిపూర్ణవంతంగా చేయవలసిందే; మంచి పరిశుభ్రతా, మనోజ్ఞతా, సామరస్యతా దృష్టితో, పద్ధతి ప్రకారంగానే చేయాలి.

శ్రీమాత, 14:327

నియమనిష్ఠత: ఏదైనా విధిగా సాధించాలంటే ఇది తప్పనిసరి.

శ్రీమాత, 14:327

విశ్వవిఖ్యాత నావికుడు కొలంబస్ స్పెయిన్ దేశం నుండి పశ్చిమంలోగల అజ్ఞాత సముద్రాలను దాటి వెళ్ళాలని బయలుదేరాడు.

తోటివారంతా అసహనతను వెలిబుచ్చుతున్నా లెక్కచేయక కొత్త లోకాలను కనుక్కోవాలనే తపనతో తన పట్టుదలను కొనసాగించాడు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎంతకాలం జరుగుతున్నా తట్టుకొని అమెరికా గడ్డ చేరేదాకా తన పట్టు వీడలేదు; కొత్త ప్రపంచాన్ని కనుగొన్నాడు.

అతను తన సహనావికులను కోరినదల్లా కేవలం ఓర్పు వహించమని. వారంతా అతనిపైనే ఆధారపడినవారు కాబట్టి స్థిమితంగా అతని మార్గదర్శకత్వంలో ఉండాలి. అయితే గమ్యం చేరటానికి అతనికి కావలసింది ఏమిటి? తరగిపోని శక్తీ, మనం పట్టుదల అనుకునే అంకురిత సంకల్పము.

శ్రీమాత, 2:193

ఒక వ్యవస్థ సక్రమంగా సాగాలంటే జరగవలసినదాని విషయంలో సుస్పష్టమైన అవగాహన, ఆ తర్వాత అది జరిగి తీరాలనే సుస్థిరమైన, నిశ్చలమైన ఒక దృఢ సంకల్పము ప్రధాన నిబంధనలు. ఇంకా ఒక సాధారణ నియమమేమంటె నీకు లేని సద్గుణ సంపద ఎదుటివారిలో ఆశించవద్దు.

శ్రీమాత, 7:244

వ్యవస్థాపకులందరికీ వర్తించే ఒక ముఖ్యసూచన: ఒక వ్యవస్థకు విలువ దాని వాసిపై ఆధారపడి ఉంటుంది.

శ్రీమాత 15:59

ప్రగతిశీలకంగా లేకపోతే ఏ వ్యవస్థకు కూడా మనుగడ ఉండదు.

ఆసలైన ప్రగతి అంటే సదా దైవానికి సన్నిహితం కావడమే. గడిచిపోయిన

ప్రతి సంవత్సరమూ ఒక నూతన పరిపూర్ణత కోసం పురోగమించడంగా గుర్తింపు పొందాలి.

శ్రీమాత 15:84

క్రమబద్ధీకరణ కావించవలసింది: ఒక వ్యవస్థని సిద్ధంచేసి, క్రమబద్ధీకరించేటప్పుడు, గుర్తుపెట్టుకోవలసిన సత్యం ఒకటుంది. ప్రతి వ్యవస్థా సహజసిద్ధంగానే అశాశ్వతమూ, అసంపూర్ణమూ అని.

శ్రీఅరవిందులు 17:87

## మానవ సంబంధాలు

నీ మీద ఆధారపడి జీవనం గడిపేవారితో నీవు చాలా మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి. వారిని దురాదరణ చేసినట్లైతే వారు ఎదుటబడి ప్రతి సమాధానం ఇవ్వలేరు — ఉద్యోగం పోతుందనే భయం వల్ల — కానీ చాలా బాధపడతారు.

నీ పై అధికారులతో దురుసుగా ప్రవర్తించడంలో ఒక దర్పం ఉంటుందేమో కానీ, నీ మీద ఆధారపడేవారితో మర్యాదపూర్వకంగా ఉండటమే గొప్పతనము.

శ్రీమాత, 13:174

నీ క్రింద పని చేసేవారిని క్రమశిక్షణలో పెట్టడంలో సరైన స్ఫూర్తిని ప్రదర్శించాలి; దానిని వారు కూడా గుర్తించాలి. తమను చాలా మర్యాదపూర్వకంగా చూస్తున్నారనీ, కేవలం కాఠిన్యం, సమర్థత ప్రదర్శించటమే కాక తమకు మర్యాద ఇచ్చి సానుభూతితో అర్థం చేసుకునే మనిషి దగ్గర పనిచేస్తున్నామనే భావన వారికి కలగాలి. అది ప్రాణిక కౌశల్యానికి సంబంధించినది. చాలా విశాలమైన దృఢమైన ప్రాణికశక్తి గలవారే ఇతరులతో వ్యవహారాన్ని చక్కగా నడిపించగలుగుతారు.

శ్రీఅరవిందులు, 23:711

అపరిపూర్ణత్వాన్ని, విఫలత్వాన్ని గర్హిస్తున్నారంటే వారు భగవంతుని గర్హించినట్లే; వారు తమ ఆత్మను తామే పరిమితంగా చేసుకుంటారు, తమ దృష్టిని తామే మోసం చేసుకుంటారు. గర్హించకుండా ప్రకృతిని పరిశీలించు. నీ సోదరులకు సహాయం

చేసి స్వస్థత కల్పించు. వారి శక్తిసామర్థ్యాలను, ధైర్యాన్ని సానుభూతితో దృఢపడేటట్లు చేయి.

శ్రీఅరవిందులు, 17:138

నేను క్షమిస్తున్నానని ఎన్నడూ అనుకోను. ప్రేమకు క్షమాపణ లేదు. అది అర్థం చేసుకుని స్పష్టపరుస్తుంది.

శ్రీమాత, 16:216

నిర్దాక్షిణ్యంగా నిన్ను నీవు పరీక్షించుకో, అప్పుడే నీవు ఇతరుల ఎడ ధర్మబుద్ధితో, కనికారంతో ఉంటావు.

శ్రీఅరవిందులు, 17:86

ఇతరులకు సహాయం చేయి కానీ, వారు శక్తిని కోల్పోయేటట్లు చేయకు, వారికి దారి చూపి, ఆదేశాలియ్యి. అయితే వారి చొరవ, అపూర్వ కల్పనాశక్తి చెదరకుండా జాగ్రత్తపడు. వారిని నీవారిగా చేసుకో; దానికి ప్రతిఫలంగా వారి స్వభావంలోని దైవత్వం వారికి అందేటట్లు చెయ్యి. ఇలా చేయగలిగిన వారే నాయకులు, గురువులు.

శ్రీఅరవిందులు, 16:391

ఎదుటివారు నీ ఊహలతోనూ, అభిప్రాయాలతోనూ ఏకీభవిస్తూ, నీవు పనిచేసే విధానమూ, వారు చేసేదీ ఒకే విధంగా ఉంటేనే గానీ నీవు వారితో సామరస్యం నెరపలేక పోవటం నీకు పెద్ద సమస్యగా తయారైంది.

నీ చైతన్యాన్ని విస్తృతం చేసుకొని ఎవరి సిద్ధాంతం వారికుంటుందనే విషయం అర్థం చేసుకోవాలి. వ్యక్తిగత సంకల్పాలు చక్కగా కలిసిపోయేటటువంటి ఒక సామరస్యపూర్వకమై, అర్థం చేసుకనే వీలుగల భూమికను కనుక్కోవటం ఎంతైనా అవసరము. అంతేకానీ ఒకే విధమైన సంకల్పమూ, కార్యాచరణ అందరిలోనూ ఉండాలనుకోకూడదు.

శ్రీమాత, 14:287

విమర్శించే అలవాటు — ముఖ్యంగా అజ్ఞానంతో ఇతరులను విమర్శించుట, అనేక భ్రమలు, అనుమానాలు, గోరంతని కొండంతలుగా చూడడటం, పెడర్థాలు తీయడం, లేనివి కల్పించడం మొదలైనవన్నీ ఒక సార్వత్రిక రుగ్మతను సూచిస్తాయి. ఇది ప్రాణిక రుగ్మత. దైహిక మనస్సు సహాయంతో అది చేసే వ్యర్థ, హానికర ప్రయత్నాలలో ఆనందం పొందే ప్రాణికం యొక్క రుగ్మత. అంతర్గతమైన అను

భవంతో బాహ్యజీవితంలో మార్పు రావాలంటే వాక్కుపై నియంత్రణ, ప్రాణికంలోని కండూతిని, రుగ్మతనూ నిరోధించడం చాలా అవసరము.

శ్రీఅరవిందులు, 24:1557-58

అనువాదం అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి

# సరియైన దృక్పథం

సరియైన దృక్పథం యొక్క శక్తి మీద నా వద్ద లెక్కలేనన్ని ఉదాహరణ లున్నాయి. ఒక్కరు సరియైన దృక్పథం కలిగి ఉండటం వల్ల జనసమూహం దుర్ఘటనల బారినుండి రక్షింపబడటం నేను చూశాను. కాని అది శరీరాన్ని దాని సాధారణ స్పందనలకు వదలివేసి ఎక్కడో పైస్థాయిలో ఉండేదిగా మాత్రం ఉండకూడదు. నీవు ఆపై స్థాయిలోనే ఉండి, "దైవేచ్ఛ ఏదో అదే జరుగును గాక" అని అనుకున్నా కూడా నీవు చంపబడ వచ్చు. ఎందువల్లనంటే నీ శరీరం దివ్యత్వం కోల్పోయినదై భయంతో వణుకుతూ ఉండవచ్చును; అది ఏ విధంగా ఉండాలంటే నిజమైన చైతన్యాన్ని శరీరంలో నిలిపి ఉంచుకోవాలి, ఇసుమంతైనా భయం ఉండకూడదు, సంపూర్ణమైన దివ్యప్రశాంతతను కలిగి ఉండాలి.

శ్రీమాత, 3:155

సమస్తమూ ప్రతి ఒక్క వ్యక్తి దృక్పథం మీద, అతని స్వభావం ఎంత చిత్తశుద్ధితో కూడుకొని యున్నదో అనేదాని మీద ఆధారపడి ఉంటుంది.

శ్రీమాత, 15:239

ఎవరు ఏ పని చేసినా అందులో వారు నిజమైన చైతన్యకాంతి కిరణాన్ని చొప్పించితే అది ఉపయోగపడేదే అవుతుంది.

ఒక వ్యక్తి ఏ పని చేసాడు అనేదాని కన్నా అతడు ఎటువంటి చైతన్యస్ఫూర్తిని కలిగి ఉన్నాడనేది ముఖ్యం. బాహ్యంలో ఎందుకూ కొరగాని పనులు కూడా సరియైన చైతన్యంతో చేయబడితే అవి ఎంతో లబ్ధిదాయకమౌతాయి.

శ్రీమాత, 14:37

నీ చేతల వలన సృష్టించబడిన వాతావరణాన్ని నీవు నీతోను, నీ పరిసరాల్లోను, నీ

లోను కలిగి ఉంటావు. నీవు చేసే పని అందంగానూ, చక్కగానూ, సామరస్యపూరిత మైనదిగానూ అయితే నీవు ఉండే వాతావరణం కూడా అందంగా, చక్కగా, సామరస్య పూరకంగా ఉంటుంది. అలా కాకుండా నీవు నీచమైన స్వార్థంతో, న్యాయాన్యాయ విచక్షణారహితంగా సొంతలాభమే చూసుకుంటూ, కనికరం లేని దుష్టబుద్ధితో జీవిస్తుంటే, అదే ప్రతి క్షణం నీ ఉచ్ఛ్వాసనిశ్వాసాలై పోతుంది. దానర్థం దైన్యమూ, నిరంతర కలవరమూను, అంటే వికారం తన స్వంత వికారానికే లోనై నిరాశచెందుతుందన్న మాట.

శ్రీమాత, 31:198

ధైర్యం, ప్రేమ ఇవి రెండే అత్యావశ్యకమైన విశిష్ట గుణాలు; తక్కిన గుణాలన్నీ గ్రహణం పట్టిపోయినా లేక సుషుప్తికి లోనయినా, ఈ రెండే ఆత్మను ఉద్ధరించగలవు.

శ్రీఅరవిందులు, 17:107

ఉదాత్తత, ఉదారత ఇవి జీవునకు సువిశాల విహాయసం వంటివి; అవి లేనివాడు చీకటి కూపంలోని కీటకంతో సమానం.

(అనువాదం: కమలాకర వెంకటరావు) శ్రీఅరవిందులు, 17:107

జనులను ప్రేమించు, సేవించు. కానీ జాగ్రత్త సుమా. నీ కోరిక వారికి అంగీకారం కాకపోయే ప్రమాదం ఉంది. అంతకంటె నీ అంతరంగంలోని ఈశ్వరాజ్ఞను ఔదలదాల్చు.

శ్రీఅరవిందులు, 17:145

ఓరిమి సంపూర్ణాధిపత్యభావంతో ఉంటుంది. దాని స్థానంలో పూర్తి అవగాహనను ప్రతిష్ఠాపించు.

శ్రీమాత, 15:298

వినమ్రతకు అర్థం మనస్సు, ప్రాణికం, శరీరాలు దైవం లేకుండా తమకు ఏదీ తెలి యదనీ, తమకు మనుగడలేదనీ, తాము ఏమీ చేయలేమనే విషయాన్ని మరచిపోకుండా ఉండడం. దైవం వినా అంతా అజ్ఞానం, గందరగోళం, నిర్వీర్యం. దైవం ఒక్కడే పరమ సత్యం, దివ్యజీవనం, దివ్యశక్తి, దివ్యప్రేమ, దివ్యానందం.

కనుక మనస్సు, ప్రాణికం, శరీరం తాము దైవాన్ని ఆయన అంతస్సత్వసారం లోనే కాకుండా ఆయన కార్యసరళి, అభివ్యక్తతలో కూడా అర్థం చేసుకోవటానికి

కానీ, ఇతమిద్ధమని న్యాయనిర్ధారణ చేయడానికి కానీ అసమర్ధమని అవశ్యం తెలుసుకోవడంతోపాటు అనుభూతినీ పొందాలి.

ఇదే కేవలం నిజమైన వినమ్రత. దానితో పాటు అలజడిలేని నిశ్చలత, శాంతి చేకూరుతాయి. ఇది దుష్టశక్తుల దాడి నుంచి కచ్చితంగా రక్షణ నిచ్చే కవచం కూడా. వాస్తవంలో మనిషి అస్తిత్వంలోని అహంభావమనే తలుపులనే ప్రతికూలశక్తి తట్టడం జరుగుతుంది. ఆ తలుపులే తెరుచుకుని అతడికి ప్రవేశాన్ని కలిగిస్తాయి.

శ్రీమాత, 14:160

కోపాన్ని వ్యక్తం చేయడం ద్వారా కోపం మరల మరల తిరిగివచ్చే అలవాటును నీవు ఎక్కువ కాలం ఉండేటట్లుగానూ లేక దానిని బలపరచడంగానీ చేస్తావు; దాని వలన నీవు కోపాన్ని తగ్గించుకోనూ లేవు, లేక పోగొట్టుకోనూ లేవు. స్వభావంలో కోపం యొక్క తీవ్రతను, శక్తిని బలహీనపరచి ఆ తరువాత దానిని పూర్తిగా వదిలించుకోవడంలో కృతకృత్యులవడానికి చేసే ప్రయత్నంలో మొదటి అడుగు దానిని చేతల్లోనూ లేదా మాటల్లోనూ వ్యక్తపరచకుండా ఉండటం. తరువాత ఆలోచనల్లోనూ, అనుభూతులలో నుంచి కూడా దానిని విసిరివేయడంతో ఇంకా ఎక్కువగా సఫలీకృతులవగలిగే అవకాశం ఉంది. అదే విధంగా ఇతర అపసవ్య గమనాలనూ దూరం చేసుకోవచ్చు.

శ్రీఅరవిందులు, 24:1410

ప్రమాదం నుంచి బయటపడినప్పుడు తప్పించి, జనులకు భగవదనుగ్రహం ఏ విధంగా పనిచేస్తుందో తెలియదు. దుస్సంఘటన జరగడం మొదలయినప్పుడు లేదా దుస్సంఘటన జరిగినదాని నుంచి వారు తప్పించుకున్నప్పుడు మాత్రమే భగవదనుగ్రహం పనిచేస్తున్నదనే విషయం వారు గ్రహిస్తారు. కాని అంతకంటె మునుపెప్పుడూ అది పనిచేస్తున్నదనే గ్రహింపు ఉండదు. ఉదాహరణకు, ఏదైనా ప్రయాణం గాని లేక మరేదైనా గాని ఎలాంటి దుస్సంఘటనా జరగకుండా గడచిపోతే,అది అపారమైన ఉత్కృష్ట కృపావిశేషం. అంటే, ఎటువంటి దుస్సంఘటనలకూ ఆస్కారం లేకుండా సామరస్యత సుప్రతిష్టితమైనదని అర్థం. కాని అది వారికి సహజమైనదిగా కనిపిస్తుంది. జనులు రోగం బారిన పడి త్వరగా కోలుకుంటే, వారు పూర్తిగా కృతజ్ఞులై ఉంటారు; కాని వారు బాగా ఉన్నప్పుడూ కృతజ్ఞులై ఉండాలన్న

విషయం వారి తలంపుకు రాదు. అయినా, అలా బాగుండడం కూడ మరింత మహాద్భుతమే!

శ్రీమాత, 5:407

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నక్రిష్ణ

## దృఢమైన అస్తిత్వం ఎల్లప్పుడూ నిశ్చలంగా ఉంటుంది

దృఢమైన అస్తిత్వం ఎల్లప్పుడూ నిశ్చలంగా ఉంటుంది. బలహీనతే అలజడికి కారణమౌతుంది.

శ్రీమాత, 16:125

బలహీనులే ఆందోళనకు లోనవుతారు; ఒకరు ఎవరైనా నిజంగా దృఢంగా తయారయితే వెనువెంటనే వారు శాంతిని, ప్రశాంతతను, నిశ్చలత్వాన్ని పొందుతారు. కలవర పరచాలనే ఉద్దేశంతో బయటి నుంచి తోసుకువచ్చే విరోధిశక్తుల తాకిడిని ఎదుర్కొన గలిగిన సహనశక్తిని వారు పొందుతారు. ఈ నిజమైన ప్రశాంతత ఎల్లప్పుడూ శక్తికి లక్షణమే. ప్రశాంతత దృఢమైనవారి సొత్తు.

శ్రీమాత, 8:330

...మనస్సు నిశ్చలమవటం అంటే పూర్తి నిశ్శబ్దత అని నేను చెప్పటం లేదు. నా ఉద్దేశంలో మనస్సు అలజడి, కలవరాలు అనేవి ఏమీ లేకుండా, నిలకడగా, తేలికగా, సంతోషంగా ఉండినదై, ప్రకృతిని మార్పునొందించే మహాశక్తికి ఉన్మీలనమవటం. ముఖ్యమైన విషయం ఏమిటంటే కలవరానికి లోనుచేసే ఆలోచనలు, చెడ్డ అనుభూతులు, గందరగోళపు ఆలోచనలు, అశాంతిని కలిగించే కదలికల అలవాటును వదిలించుకోవాలి. ఇవి నీ ప్రకృతిని అశాంతికి గురిచేసి, మసకబారునట్లు చేసి, దివ్యశక్తి పనికి విఘాతం కలిగిస్తాయి. మనస్సు నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటే దివ్యశక్తి చాలా తేలికగా పనిచేయ గలుగుతుంది.

శ్రీఅరవిందులు, 23:637

మాటల్లోనూ లేదా చేతల్లోనూ వ్యక్తం చేస్తేనే ఆలోచన లేదా ఇచ్ఛ ప్రభావాన్ని చూపగలుగుతుందని అనుకోవటం పొరపాటు; వాగ్రూపం పొందని ఆలోచన, అవ్యక్త

మగు ఇచ్ఛ కూడా క్రియాశీలశక్తులే; అవి వాటివైన స్పందనలను, ప్రభావాలను, ప్రతిక్రియలను సృష్టించగలవు.

శ్రీఅరవిందులు, 22:477

నిశ్శబ్దం అంటే ఆలోచనల నుంచి, ప్రాణిక గమనాల నుంచి స్వేచ్ఛ — అది సమస్త చైతన్యం నిశ్చలమై కదలిక లేని స్థితి.

*(Guidance from Sri Aurobindo,* by Nagin Doshi 127)

నిశ్శబ్దం నుంచే శాంతి వస్తుంది; శాంతి లోతులలో ఇంకా లోలోతులలో ధృవపడినప్పుడే అది మరింత ఎక్కువైన నిశ్శబ్దంగా రూపొందుతుంది.

నిశ్సబ్దం అనేదాన్ని మనం ఆలోచనల కదలికలూ లేక అనుభూతులూ మొదలైనవి ఏమీ లేకపోవటమనే స్థితిని వ్యక్తపరచుటకు ఎక్కువగా బాహ్యంలో వాడుతుంటాము; అది కేవలం మనస్సు యొక్క ఉత్కృష్ట నిశ్చలత.

కాని నిశ్శబ్దంలోనూ కర్మ ఉండగలదు, విశ్వంలోని నిశ్శబ్దంలో విశ్వగత కర్మ ఏ విధంగా కొనసాగుతుందో అదే విధంగా నిశ్శబ్దంలోని కర్మ కూడా ఎటువంటి కలవరం లేకుండా ఉండగలదు.

శ్రీఅరవిందులు, 23:647

పరమ ప్రశాంతిలోను, పరమ నిశ్శబ్దంలోను శాశ్వతుడు అభివ్యక్తమవుతాడు; నీ అస్తిత్వాన్ని ఏ కలవరానికీ లోను కానీయకు, శాశ్వతుడు అభివ్యక్తమవుతాడు....

శ్రీమాత, 1:10

మన క్రియాశీల అస్తిత్వం, దాని పనిముట్లు చికాకుకు లోనవడం, త్వరగా అలసటను పొందడం అనేది ప్రగాఢమైన నిశ్చలతే మన నిజమైన పునాది అనీ, ఆవేశానికి గురి కావడం మన ఆత్మకు సోకిన వ్యాధి లక్షణమనీ విశ్వప్రకృతి సూచిస్తున్నది; కేవల ప్రశాంతత యొక్క నిస్సారమైన, విసుగుకొలిపే స్థితి ఈ క్రీడా జగత్తు ఆ దృఢమైన నిశ్చలత అనే పునాది మీదనే కార్యకలాపాలు కొనసాగించాలనే విషయాన్ని ఆమె గుర్తు చేస్తుందనీ, మన నుంచి ఆమె దానినే ఆశిస్తున్నదనే దానికి సంకేతం. భగవంతుని నిరంతర ఖేళి, అయినా ఆయనను కలవరపరచదు.

శ్రీఅరవిందులు, 16:386

మన ప్రకృతి గందరగోళమూ, చికాకులతోనూ కూడిన ఒత్తిడి ఆధారంగా కర్మలో పాల్గొంటుంది; దైవం అంతులేని ప్రశాంతతతో స్వేచ్ఛగా కర్మను సలుపుతుంటాడు.

ఆత్మ మీద నిమ్నప్రకృతి ఆధిపత్యాన్ని లేకుండా చేయాలంటే, ప్రశాంతత అనే అగాధాల లోతులలోకి మనం అవశ్యం దూకి, మనం అదే అయిపోవాలి...

శ్రీఅరవిందులు, 20:350

ప్రభూ, అన్నింటా ప్రతీ చోటా, నీ సర్వోత్కృష్ట అవిరళ ప్రశాంతీ, నీ మార్పు లేని శాశ్వతత్వము ఒసగే ప్రశాంత దృష్టి లేకుండా పోతున్నది.

శ్రీమాత, 1:255

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నక్రిష్ణ

## సమగ్ర విశ్వాసం — అవిచ్ఛిన్నమగు సహనం

మొదటగా కావలసినవి విశ్వాసం, సహనం. ఎంతో నిరాడంబరమై, ప్రశాంతతో నిండి సహాయం చేసే వాటికి తమ తీవ్రానుభూతులతో ఏవగించుకుంటూ బలపరచ కుండా ఉండటం వలన హృదయోద్రేకాలు, అత్యంతాకాంక్షాపూరిత ఇచ్ఛాపూర్వక దౌర్జన్యాలు స్వర్గసామ్రాజ్యాన్ని ఆక్రమించుకోవాలని హఠాత్తుగా విరుచుకుపడి దాడిచేసి వశపరచుకోవడానికి ప్రయత్నం చేస్తే విపరీతమైన దుఃఖకారక పరిణామా లుండగలవు.

శ్రీఅరవిందులు, 20:232

జనులకు విశ్వాసం ఎంత ముఖ్యమైనదో తెలియదు; విశ్వాసం అద్భుతం చేస్తుందనీ, అది అద్భుతాల సృష్టికర్త అనీ తెలియదు. నీవు ప్రతి క్షణం పైకి ఉన్నతస్థితికి లేవ నెత్తబడి, దైవం వైపుకు లాగబడాలంటే, ఆయన నిన్ను పైకెత్తటానికి వస్తాడు. ఆయన నీ కోసం చాలా, చాలా దగ్గరగా ఎప్పటికంటే చాలా దగ్గరగా ఉంటాడు.

శ్రీమాత, 13:78

పట్టు విడవకుండా ఉంటే ఎవరైనా కష్టాలను గెలవవచ్చు. కాని వాటి నుంచి పారిపోయి మాత్రం కాదు. ఎవరైనా పట్టు విడువకుండా అంటిపెట్టుకుని ఉంటే ఖచ్చితంగా గెలుపు సాధ్యం. విజయం వరించేది సహిష్ణులనే. ఎల్లప్పుడూ నీవు చేయగలిగినంత ఉత్తమంగా చేయి, ఫలితం పరమేశ్వరుడు చూసుకుంటాడు.

శ్రీమాత, 14:173

అన్ని సందర్భాలలో సత్యానికై నిలబడగలగటం, వ్యతిరేకతల నడుమ సత్యప్రకటన

చేయగలగటం, అవసరమైనప్పుడు దానికోసం పోరాడగలగటమే కాక, అన్ని సమయాలలో తన ఉన్నతోన్నత చైతన్యం నుంచి కర్మను చేయగలగడం, వీరలక్షణం.

శ్రీమాత, 14:179

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నక్రిష్ణ

## మనకు కావలసింది బలం

బాగా లోతుగా చూస్తే మనకు లేనిది, అన్నింటికన్నా ముందు మనం సంపాదించుకోవలసింది — బలం. భౌతికబలం, మానసికబలం, నైతికబలం, అన్నింటికీ అవ్యయ అవినాశ మూలం అయిన ఆధ్యాత్మిక బలం — అది అన్నింటినీ మించిన బలం — మనకు కావాలి. మనకు బలముంటే తక్కిన ప్రతిదీ, తేలికగా, సహజంగా, మనకు తోడవుతుంది. బలం కొరవడితే చేతులుండీ దేనినీ పట్టుకోలేని, దేనినీ దెబ్బకొట్టలేని, కాళ్ళుండీ పరుగెత్తలేని, కలల్లోని మనుష్యుల్లాగా తయారౌతాం.

అలాంటప్పుడు మనకు కావలసింది బలం. మళ్ళీ మళ్ళీ కూడా కావలసింది బలమే, అధికాధిక బలం మన జాతికి కావాలి. మనం కోరేది బలం అయినపుడు, బలం యొక్క దివ్యజననిని ఆరాధించకుండా దానినెలా పొందగలుగుతాం? ఆమె తన కోసం మనల్ని తనను ఆరాధించమని అభ్యర్ధించడం లేదు, మనకు సహాయం చేయడానికి, మనకు తనను తానిచ్చివేసుకోవడానికి, మనల్ని ఆరాధించమంటున్నది. ఇదొక అసహజమైన భావం కాదు, ముఢనమ్మకం కాదు, జగత్తు యొక్క సాధారణ ధర్మం. వేలుపులు మనకు తమను ఇచ్చివేసుకొనడం జరిగినా అది మనం కోరకుండా జరుగదు. మనిషి మీదికి దైవం సైతం అతని ఎరుక లేకుండా వచ్చిపడడు. ఆ దైవ శక్తి తన అనిర్వచనీయమైన అందంతో, పారవశ్యంతో జీవిపై వర్షించాలంటే, మనం అతని వైపుకు తప్పక తిరగాలనీ, అతన్ని వేడుకోవాలనీ, అతన్ని ఆరాధించాలనీ ప్రతి భక్తునికీ అనుభవపూర్వకంగా తెలుసు. శాశ్వతుడైన అతని విషయంలో ఏది సత్యమో, అతని నుండే వెల్లివిరిసిన ఆమె విషయంలో గూడా అది సత్యమే...

అయినప్పుడు, ఇటు తిరుగు. దివ్యజనని పిలుపు నాలకించు, ఆమె యిప్పటికే మన హృదయాలలో, తనను తానభివ్యక్తం చేసుకొనడానికి, మన చేత పూజలందుకొనడానికి వేచి వున్నది — ఆమె ఇపుడు నిష్క్రియంగా వున్నది,

అంటే దానికి కారణం మనలోని భగవంతుడు తమస్సుచే కప్పబడి వున్నాడు. ఆమె నిష్క్రియతచే యిబ్బంది పడుతున్నాడు. ఆమె విచారంగా వున్నది, ఎందు కనంటే తమకు సహాయమందించమని తన బిడ్డలు తనను పిలువనందుకు. నీలో ఆమె అలజడి చెందుతున్నదని నీకు సంవేదన కలుగుతున్నపుడు, ఆత్మ కడ్డుగా ఉన్న నల్లని తెరను తొలగించివెయ్యి, ఆమెను బంధించి వుంచుతున్న సోమరితనపు గోడలను బ్రద్దలు కొట్టు. మీలో ప్రతి ఒక్కరూ, తాను ఎలా, ఏ మార్గంలో ముందుకు నెట్టబడుతున్నాడో అలా ఆమెకు మీ దేహాలతో, లేదా మీ బుద్ధితో, లేదా మీ అభిభాషణతో, లేదా మీ సంపదతో, లేదా మీ ప్రార్థనలు, పూజాదులతో మీ శక్తి ననుసరించి ఆమెకు సహాయం చెయ్యండి. వెనక్కు తగ్గవద్దు, ఎందుకనంటే, ఎవరినైతే ఆమె పిలిచిందో, వారు ఆమె పిలుపును పెడచెవిని పెడితే, ఆమె తానుగా వచ్చిన రోజున వారిపై కినుక వహించవచ్చు. కాని ఆమె రాక కెవరు సహాయమందిస్తారో, అది ఏ కొంచెమైనా సరే, వారికి ఆమె మోము ఎంత సౌందర్యంతో, కరుణతో తేజరిల్లుతూ దర్శన మిస్తుందో!

భారతదేశ కార్యాన్ని, ప్రపంచ కార్యాన్ని, భగవంతుని కార్యాన్ని నిర్వహించడానికి ఇప్పుడు సంసిద్ధతను తెలిపే ప్రతి వ్యక్తికీ, ముఖ్యంగా యువకులకు మేమిచ్చే పిలుపేమిటంటే "మీ మనస్సులను ఐరోపియ భావాలకు లోనుచేయకండి. లేదా మీ జీవితాన్ని భౌతిక దృక్కోణం నుంచి చూడకండి. అలా జరుగక పోతే ఈ ఆదర్శాలను కాపాడుకోలేరు. భౌతికపరంగా నీవేమీ కాదు. ఆధ్యాత్మికపరంగా సమస్తమూ నీవే. భారతీయుడు మాత్రమే సమస్తాన్నీ నమ్ముతాడు, సమస్తాన్నీ సాధించ సాహసిస్తాడు, సమస్తాన్నీ పరిత్యజిస్తాడు. అందుచేత మీరు మొట్టమొదట భారతీయులుగా తయారవ్వండి. మీ పూర్వీకుల సాంప్రదాయాన్ని తిరిగి సంపాదించు కోండి. ఆర్యుని చింతనను, ఆర్యుని క్రమశిక్షణను, ఆర్యుని స్వాభావిక లక్షణాన్నీ, ఆర్యుని జీవితాన్ని తిరిగి సంపాదించుకోండి. వేదాంతాన్ని, గీతను, యోగాన్ని తిరిగి స్వీకరించండి. వాటిని మేధస్సులో మాత్రమే గాక, భావోద్వేగంలోనే గాక మీ జీవితాల్లోనికి స్వీకరించండి. వాటిని అనుజీవించండి, అప్పుడే మీరు బలవంతులు, ప్రచండశక్తివంతులు, అజేయులు, భయరహితులు అవుతారు. జీవన్మరణాలు మిమ్మ భయపెట్టలేవు. కష్టం, అసాధ్యం అనే మాటలు మీ పదకోశం నుండి అంతర్ధానమౌతాయి. ఎందుకనంటే ఆత్మశక్తి అనంతం. నీకు బయటనున్న సామ్రాజ్యాన్ని జయించడానికి

ముందే నీ ఆత్మసామ్రాజ్యాన్ని అంటే నీ ఆంతరిక సామ్రాజ్యాన్ని నీవు జయించి వశంచేసుకోవి తీరాలి. అచట, నీ ఆంతర ప్రపంచంలో దివ్యజనని నివసిస్తోంది. నీకు బలాన్నివ్వడానికి, నీవామెను ఆరాధించాలని వేచివున్నది. ఆమెలో నమ్మక ముంచు, ఆమెను సేవించు. నీ సంకల్పాలను ఆమెలో కలిపివెయ్యి. నీ అహంకారాన్ని దేశం యొక్క అహంకారంలో లీనం చెయ్యి. మానవజాతి సేవలో నీ ప్రత్యేక స్వార్థపరతను లుప్తం చెయ్యి. సమస్త బలం యొక్క మూలాన్ని నీలో తిరిగి స్వాధీనం చేసుకో. అపుడు సాంఘిక భద్రత, శేముషీ వైదుష్యం, రాజకీయ స్వేచ్ఛ, మానవచింతనపై ప్రభుత, ప్రపంచాధిపత్యం, అన్నీ నీకు సంప్రాప్తిస్తాయి.

మూలం శ్రీఅరవిందులు

అనువాదం కె. వి. రావు

# చతుర్విధ వ్యక్తిత్వ సంపూర్ణత

నూతన జ్ఞానసీమల లోనికి ప్రవేశించి వాటిని జయించడానికి మేధోపరమైన, నైతికపరమైన ధైర్యం, దృఢసంకల్పం, సాహసించే లక్షణం జ్ఞానికి లేకపోతే అతడు పరిమిత బుద్ధికి బానిసగా, లేక దాసునిగా, మహా అయితే, కర్మకాండగా చేయబడి స్థిరీకరించబడిన జ్ఞానాన్ని సేవించే ఒక పౌరోహితునిగా తయారౌతాడు. బహుశా అందుచేతనే కాబోలు, క్షత్రియుడే తన ధైర్యసాహసాలను విజయోత్సాహాన్ని అంతఃస్ఫురిత జ్ఞానసీమల లోనికి, ఆధ్యాత్మికత అనుభవ క్షేత్రాల లోనికి కొనితెస్తూ, వేదాంతం యొక్క మహనీయ సత్యాలను మొట్టమొదట ఆవిష్కరించాడు. అతడు పరమ సత్యాన్ని స్వేచ్ఛతో, పరిపూర్ణంగా సేవించలేడు. జ్ఞానం ద్వారా గ్రహించిన సత్యాలను జీవితంలో ఆచరించి ఫలప్రదం చేయడానికి తగిన విధంగా వాటిని సవరించగల చతురత అతడికి ఉంటే తప్ప, అతడు తన జ్ఞానాన్ని అత్యంత ప్రయోజనకరంగా ఉపయోగించలేడు. అలాంటప్పుడు అతను కేవలం ఊహలోనే జీవిస్తాడు. అలా ఉపయోగించలేకపోతే, అతడు తన జ్ఞానాన్ని పూర్ణంగా భగవదర్పణ చేయలేడు. అందుకు మానవాళిపై సేవాస్ఫూర్తి అవసరం.

శక్తిశాలి అయిన మనషి జ్ఞానంతో, హేతుబుద్ధి, వెలుగుతో, లేదా మతపరమైన లేదాఆత్మ సంబంధిత వెలుగుతో తన క్రియాశక్తిని ప్రకాశమయం చేయాలి,

ఉద్ధరించాలి, నియంత్రించాలి. లేనియెడల అతడు కేవలం ఒక ప్రబల అసురునిగా తయారౌతాడు. తన శక్తిని కార్యనిర్వహణకు వినియోగించడానికి సక్రమంగా, తగిన రీతి నియంత్రించి దానిని సృజనాత్మకం, ఫలప్రదం చేయడానికి ఇతరులతో తన సంబంధ బాంధవ్యాలకు తగిన విధంగా తనను మలచుకొనేందుకు బాగా ఉపకరించే కౌశలాన్ని అతడు తప్పక కలిగి వుండాలి. లేనియెడల జీవనక్షేత్రంలో కేవలం అతడు ముందుకు నడిపే ఒక శక్తిగా, నిర్మాణాత్మకమైన ఒక శక్తిగా కావడం కంటె అధికంగా విధ్వంసం సృష్టిస్తూ సాగిపోయే ఒక తుఫానుగా తయారౌతాడు. వినమ్రుడై, తన బలాన్ని భగవంతునికి, ప్రపంచానికి సేవచేసే ఒక శక్తిగా ఉపయోగించగలగాలి. లేనియెడల అతడొక స్వార్థపూరిత పెత్తందారుగా, నిరంకుశుడుగా, మనుష్యుల అంతరంగాలను, దేహాలను ఆటవికంగా అణచివేసే వానిగా తయారౌతాడు.

పునరుత్పాదక ప్రవృత్తిగల మనస్సున్నవాడు, కార్యసాధకుడు అయినవాడు, నిష్కపటంగా తనను గురించి తాను విచారించుకోగల మనస్సు, భావాలు, జ్ఞానం తప్పక కలిగి వుండాలి. లేనియెడల విస్తృతమైన ఎదుగుదల లేని ఆతని నిత్యకార్య క్రమాలలోనే చరిస్తూ వుండిపోతాడు. అతడికి ధైర్యం వుండాలి, నూతన సాహసాలు చేసే ఉత్సాహం ఉండాలి. తన ఆర్జనలో, తను ఉత్పత్తిచేసే దానిలో, ఆర్జించడమనేదే ధ్యేయం గాక, సంపదను కూడబెట్టి తన స్వీయజీవితాన్ని మాత్రమే ఆనందంగా భోగించడం గాక చుట్టూ ఉన్న జీవనాన్ని ఫలప్రదం చేసేటందుకు, తద్వారా తాను కూడా లాభపడ్తాడు గనుక, ఎరుకతో దానికి సాయం చేసేందుకు తన ఆర్జన లోనూ, తాను ఉత్పత్తిచేసే దానిలోనూ సేవాదృక్పథాన్ని చొప్పించగలగాలి.

శ్రామికుడు, సేవాతత్పరుడు అయినవాడు తన పనిలో జ్ఞానాన్ని, గౌరవాన్ని, ఆకాంక్షను, నైపుణ్యాన్ని ప్రవేశపెట్టలేకపోతే, అతడు ఒక నిస్సహాయుడైన వెట్టివానిగా, సంఘానికి ఒక బానిసగా తయారౌతాడు. అలా ఆ లక్షణాలను తనలో ప్రవేశపెట్టడం ద్వారా మాత్రమే అతడు విశాలమయ్యే మనస్సుతో, సంకల్పంతో, ఉన్నత ధర్మాలతో సంఘానికి అర్థవంతంగా ఉపయోగపడగల స్థాయికి అభివృద్ధి చెందుతాడు.

వీటిలో ఏదో ఒకటి మిగతావాటికి నాయకత్వం వహించినప్పటికీ అతని స్వభావాన్ని అధికాధికంగా సమగ్రమైన పూర్ణత్వంలోనికి, చతుర్విధ శక్తులు విశ్వంపై ప్రభావం చూపే సామర్థ్యం వైపు కున్మీలనం చేసినప్పటికీ, అతడు ఈ శక్తుల నన్నింటినీ

తనలోనికి స్వీకరించి ఏకోన్ముఖం చేయగల విధంగా తనను తాను విశాలం చేసు కొన్నపుడు మనిషి మహనీయ పరిపూర్ణతకు చేరుకొంటాడు.

ఈ ధర్మాల్లో ఏదో ఒకదానికి మాత్రమే చెంది వుండి, తక్కినవాటిని కాదనే ప్రత్యేక నమూనాగా మనిషి తక్కినవాటి నుండి విడగొట్టబడి లేడు. అతనిలో ఈ శక్తులన్నీ సరిగా రూపుదాల్చక అయోమయావస్థలో పనిచేస్తుంటాయి మొదట్లో. కాని అతడు ఏదో ఒకదానికి జన్మ జన్మల పరంపరలో ఒక రూపాన్నిస్తుంటాడు. ఒకదాని నుండి మరోదానికి, అదే జన్మలో కూడా పురోగమిస్తూ తన ఆంతరిక అస్తిత్వం యొక్క సంపూర్ణ అభివృద్ధి వైపు పయనిస్తాడు. అసలు మన జీవితమే సత్యాన్వేషణ, జ్ఞానాన్వేషణ, చుట్టూ ఉన్న వత్తిడి కలిగించే శక్తులతోనూ, మన సంకల్పంతోనూ మనం జరిపే ఒక సంఘర్షణ, నిరంతర పునరుత్పత్తి, తనను పరిస్థితుల కనుగుణంగా మలచుకోవడం, జీవితంలో భౌతికానికి సంబంధించినదానికే మనం కౌశలాన్ని వినియోగించడం, అంతేగాదు, అదొక యజ్ఞం, ఒక దాస్యం.

అంతరాత్మ తన క్రియాశక్తిని ప్రకృతిలో కార్యసాధన కుపయోగించే పార్శ్వా లివన్నీ. కాని మనం మన ఆంతర అస్తిత్వ మూలాల సమీపానికి చేరువవుతున్నప్పుడు ఈ రూపాల్లో అంతర్లీనమై ఉన్న ఒకదాన్ని దేన్నో మనం క్షణకాలం దర్శిస్తాము, అనుభవాన్ని పొందుతాం. వీటి నుండి తనను తాను విడగొట్టుకొని వాటి వెనుక నిల బడి, వాటిని నడుపుతున్న దాన్ని క్షణకాలం దర్శిస్తాం, దాని అనుభవాన్ని పొందుతాం. సజీవమైన చింతనశీలియైన ఈ యంత్రం చేసే ప్రత్యేక కార్యాన్ని భరించడానికి ఒక సర్వసాధారణ దివ్యసన్నిధానం, లేక దైవశక్తి ముందుకు తేబడినట్లు మనం గ్రహిస్తాం. ఇలా ముందుకు తేబడినది వేరెవ్వరో గాదు, అంతరాత్మ యొక్క క్రియాశక్తే, ఈ ప్రకృతి నధిష్టించి, ప్రకృతి శక్తులను ఆమె పూరిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

వీరలక్షణం:

1. ఎల్లప్పుడూ అత్యంత సుందరమైనదానిని, అత్యంత ఉదాత్తమైనదానిని చేయడం.

2. ఎల్లప్పుడూ తన చైతన్యపు అత్యున్నతస్థితి నుంచి కర్మను చేయడం.

శ్రీమాత, 14:129

# జీవితాన్ని చూసి భీతిల్లకు

జీవితాన్ని చూసి భీతిల్లకు. ఓ ఆర్యపుత్రా!
భగవంతుడు నీకు చివరి ప్రయాణం నిర్దేశించేంత వరకు
సమధికానందోత్సాహాలతో మంచిచెడులను,
పాపపుణ్యాలను స్వీకరించు.
కాని నువ్వు జీవించినంత కాలం నీ పాత్రను నువ్వు
పరిపూర్ణంగా నిర్వర్తించు.
ఈ భూమి నీ వేదిక, నువ్వొక బలీయమైన నటుడివి.
నాటకం ఆయనది.
పనిచెయ్యి, ఫలితాలు భగవానునికి వదిలివెయ్యి.
ఉన్నది ఆయనే.
శ్రమించు, ప్రేమించు, తెలుసుకో — నీ ఆత్మ
అమృతానంద పారవశ్యం పొందుతుంది.
ప్రేమించు జనావళిని, ప్రేమించు జగత్ప్రభువును.
ప్రేమించడానికి భయపడకు, ఓ రాజా!
ఆనందించడానికి భయపడతావెందుకు?
మరణం ఒక మార్గం, బాధ ఊహాజనితం.
అవి తెలివిహీనుల్ని ఏడిపించడానికే.
అహం నుండి పారిపో, ప్రేమతోనే మహోన్నత హర్షం పొందు.

భగవంతుడిని భూమి పైనే అన్వేషించు.
మానవ భవితవ్య పథంలో విజయ శిఖరాలు చేరే
మానవాళి కోసం మాహాసామ్రాజ్య నిర్మాణం కోసం
భగవంతుడు నీ కోసం ఈ కోటి కోటి లోకాలు సృజించాడు.
నీ మానవశక్తిని పరిపూర్ణతా ప్రజ్వలితం కావించు.
మానవజాతిని పరిపూర్ణత్వపు శిఖరాల వైపు నడుపు

నువ్వు భగవంతుడివే, ఓ రాజా!
నీ సంకల్పం వల్లనే నీ ఆత్మను అజ్ఞాన నిశీధి
ఆవరించింది. ఆ చీకటి తెరలు తొలగించు.
నీ సుప్రశాంత పూర్ణరూపాన్ని తిరిగి పొందు.
నీ అసలు రూపం అదే! అదే!
ప్రేమికుడైన మనిషిని చివరి గమ్యమైన
భగవంతుని వైపు ఉద్ధరించు.

మూలం: శ్రీఅరవిందులు ('ఋషి' అనే ఆంగ్ల పద్యం నుండి)
అనువాదం: కె. యజ్ఞన్న

# భవిష్యత్ ప్రపంచ నిర్మాణానికి సహకరించే వ్యక్తులు

ఆధ్యాత్మిక పరిణామమే మానవ భవితవ్యం అని, మనిషికి అది అత్యంత ఆవశ్యకమని గుర్తించిన వ్యక్తులు రాబోయే వినూతన యుగంలో భవిష్యత్ ప్రపంచ నిర్మాణానికి అధికంగా సహాయపడతారు. మృగప్రాయుడైన మనిషి ఆలోచించే మనిషిగా, శిఖరాగ్రాన అత్యున్నతంగా ఆలోచించగల మానవాళిగా ఎలా రూపుదిద్దుకున్నాడో, అలాగే ప్రస్తుత మానవాళి ఆధ్యాత్మిక శక్తి ప్రదీప్త మానవాళిగా పరివర్తన చెందడం లేదా పరిణమించడం మానవజాతికి అత్యంత అవసరం. అదే ప్రకృతి ఉద్దేశ్యం కూడా. ఈ పరివర్తనను సమర్థించే సిద్ధాంతాలు ఏవైనా, వాటికి ఏ పేరు పెట్టినా నష్టం లేదు. ఆ పరిణామం, పరివర్తన మానవుల ఆదర్శం కావాలి. అందుకే వారు ప్రయత్నించాలి. ఒక నిర్దిష్ట విశ్వాసానికి, రూపానికి వారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తారు. తాము నమ్మిన విశ్వాసాలకు, రూపాలకు మనుషులకు స్వేచ్ఛగా కదులుతారు. ఆధ్యాత్మిక పరివర్తనను విశ్వసించాలి. ఆ విధంగా జీవించడానికి ప్రయత్నించాలి. ఇదే ముఖ్యం అని ఆ వ్యక్తులు భావిస్తారు. జ్ఞానం ఏ అభిప్రాయ రూపాన్ని దాల్చినా నష్టం లేదు. ఆ జ్ఞానాన్ని ఈ జీవనవిధానంగా పరివర్తన చెందించాలి. యాంత్రికమైన పద్ధతి ద్వారా, బాహ్యసంస్థల ద్వారా ఈ మార్పు వస్తుందని వారేనాడూ అనుకోరు. అటువంటి పొరపాటు వారుచేయరు. ప్రతి మనిషి అంతర్గతంగా ఈ ఆధ్యాత్మిక

పరివర్తనను అనుసరించాలి, జీవించాలి. అలా కాకపోతే అది వాస్తవరూపం దాల్చదు. ఈ విషయం వారికి తెలుసు. వారేనాడూ ఆ అంశాన్ని మరచిపోరు. తనలోనే భవితవ్య రహస్య జ్ఞానసిద్ధిని, ముక్తిని పొందాలన్న ప్రాక్ ప్రపంచపు అంతర్దర్శనాన్ని వారు అనుసరిస్తారు. జీవితానికి పాశ్చాత్య ప్రపంచం సక్రమంగా ఇచ్చే ప్రాముఖ్యాన్ని, మనకు తెలిసినంతగా ఉత్తమ జీవితాన్ని తీర్చిదిద్దుకోవడాన్ని, సమస్త జీవితానికి వర్తించే నియమాన్ని సాధించవచ్చునన్న ఆశయాన్ని ఈ వ్యక్తులు — భిన్నకోణంలో — ఆమోదిస్తారు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

# శివాజీ — జైసింగ్

## (మృతవీరుల సంభాషణ)

**జైసింగ్:** మన ఇరువురిలో ఏ ఒక్కరూ విజయం సాధించలేదు. ఏదో తృతీయశక్తి ఈ రాజ్యంలో ప్రవేశించింది. నీ శ్రమ ఫలితాలను స్వీకరించింది. నాకు సంబంధించి నా శ్రమ తునాతునకలయింది. నేనెంతో ప్రియంగా భావించిన ఆదర్శం మట్టిపాలైంది.

**శివాజీ:** ఫలితం కోసం నేను శ్రమించలేదు. నా అపజయానికి నేను ఆశ్చర్యచకితుడ్నవలేదు. నిరుత్సాహపడలేదు.

**జైసింగ్:** ఏదో బహుమతి కోసం నేను కూడా పనిచేయలేదు. రాజపుత్ర ఆదర్శం సముద్ధరణకు ప్రయత్నించాను. ధర్మబద్ధమైన యుద్ధంలో చెక్కుచెదరని ధైర్యసాహసాలు, మిత్రులు శత్రువుల పట్ల ఔదార్యం, మనం ఎంచుకొన్న సార్వభౌముని పట్ల ఉదాత్త విధేయత — ఇదే నిజమైన భారతీయ సత్సంప్రదాయం. అది ఐక్యత కన్న, హిందూజాతి ప్రాబల్యం కన్నా ప్రధానమైనది. అందుకనే నీ అభిలాషను మన్నించలేను. నా సొంత సంప్రదాయాన్ని ఆమోదించడానికి నీకు అవకాశం ఇచ్చాను. నా పట్ల, నీ పట్ల విశ్వాసం సన్నిగిల్లినప్పుడు, నా పరువును కాపాడుకొన్నాను. నువ్వు తప్పించుకోడానికి సహాయపడ్డాను.

**శివాజీ:** భగంతుడు నాకు రక్షణ కల్పించాడు. నాకు ప్రేమను, సహాయాన్ని వరాలుగా ఇవ్వడానికి ఒక స్త్రీ హృదయాన్ని కదిలించాడు. సంప్రదాయాలు మారతాయి.

రాజపుత్ర ఆదర్శానికి భవిష్యత్తు ఉంది. తాత్కాలికమైనదానిని వదులుకోడం కోసం మూసని విచ్ఛిన్నం చేయాలి. నేను ఎంచుకొన్న సార్వభౌముని పట్ల విధేయత మంచిదే. నా జాతి ఎంచుకొన్న సార్వభౌముని పట్ల విధేయత మరింత మంచిది. దేశచక్రవర్తిలో దీపించే భగవచ్ఛక్తి వల్ల అతను దివ్యత్వ సంశోభితుడు అవుతాడు. కాని ప్రజలు ఎన్నుకొన్నందువల్లనే అతనిలో దివ్యత్వం భాసిస్తుంది. జాతిలోని భగవంతునికి చక్రవర్తి దాసుడు. మహారాష్ట్ర ప్రజలు ఆరాధించే విఠోబా, విరాట్, భారతావనిగా మూర్తీభవించిన భవానీ — వారి శక్తితోనే నేను జయించాను.

**జైసింగ్:** నీ రాజకీయ ఆదర్శం గొప్పది. కాని నీ ఉపకరణాల ప్రమాణం నీతి బాహ్యమైనది. జిత్తులు, విద్రోహం, దోపిడీ, హత్యాకాండలు ఇవన్నీ నీ కార్యపథకంలో చోటుచేసుకొన్నాయి.

**శివాజీ:** నా కోసం నేను పోరాడలేదు. నా కోసం పాలించలేదు. భగవంతుని కోసం, మహారాష్ట్ర ధర్మం కోసం, రామదాసు ప్రబోధిచిన హిందూజాతి మతం కోసం పోరాడాను. భవానీ కోసం నా శిరస్సు ఖండించడానికి సిద్ధపడ్డాను. జాతి సంక్షేమం కోసం పాటుపడాలని ఆమె ఆదేశించింది. నా రాజ్యాన్ని రామదాసుకు సమర్పించాను. భగవంతుని, మహరాష్ట్రీయుల బహుమతిగా దానిని తిరిగి నాకిచ్చి వేశాడు. ఆ రెండు ఆదేశాలను పాటించాను. భగవంతుని ఆదేశానుసారమే ఏను సంహారం చేశాను. భగవంతుడిచ్చిన ఉపకరణంగా భావించి నేను దోపిడీలు జరిపాను. నేను ద్రోహిని కాను. వనరుల కోసం ద్రోహి నయ్యాను. ప్రజల కోసమే యుద్ధతంత్రాలు నేర్చాను. మేధాశక్తితో, బుద్ధిసూక్ష్మతతో భౌతికశక్తిని జయించాను. యుద్ధాలు, రాజకీయాలలో జిత్తులు, ఎత్తుగడలను ప్రపంచం ఆమోదించింది. మహారాష్ట్ర రాజ పుత్రుల ఔదార్య, సాహస సౌశీల్యం యూరప్, ఆశియా దేశాల ప్రజలకే లేదు.

**జైసింగ్:** ధర్మమే మహోత్కృష్టమైనది. దానిని పరిత్యజించేట్లు భగవంతుని మాటలు సైతం నన్ను ప్రోద్బలం చేయలేదు.

**శివాజీ:** నేను అన్నీ భగవంతునికే సమర్పించాను. ధర్మాన్ని సైతం అర్పించేశాను. ఆయన సంకల్పమే నా మతం. ఆయనే నా అధినేత. నేను ఆయన సైనికుడ్ని. అది నా విధేయత. ఔరంగజేబుకు విధేయుడ్ని కాను. నైతిక నిబంధనావళికి విధేయుడ్ని కాను. నన్ను పంపిన భగవంతునికే విదేయుడ్ని.

**జైసింగ్:** విభిన్న ప్రయోజనాల కోసం మనల్ని భగవంతుడు భూమికి పంపిస్తుంటాడు.

ఆయా ప్రయోజనాలను అనుసరించి ఆదర్శాన్ని, శీలాన్ని తీర్చిదిద్దుతాడు. మొగల్ సామ్రాజ్యం పతనమైనదని నేను విచారించను. సార్వభౌమాధికారాన్ని అట్టిపెట్టుకోవడానికి చక్రవర్తికి అర్హత వుంటే, దానిని ఆయన పోగొట్టుకొనేవాడు కాదు. ఆయనకు అర్హత లేకపోయినా, నా విశ్వాసం, విధేయత, సేవానిరతి కోల్పోలేదు. నా చక్రవర్తి సంకల్పంతో విభేదించాలని నా ఉద్దేశం కాదు. ఆయన్ని నియమించిన భగవంతుని తీర్పుకే వదిలిపెట్టాను. అది నా పరిధి కాదు.

**శివాజీ:** తిరుగుబాటు చేసే వ్యక్తిని, ఒప్పందం ద్వారా అన్యాయమైన అధికారాన్ని కొనసాగించడానికి తిరస్కరించే వ్యక్తిని కూడా భగవంతుడే నియమిస్తాడు. అధికారం పక్షాన భగవంతుడు ఎల్లప్పుడూ ఉండబోడు. రక్షకునిగా ఒక్కొక్కసారి అవతరిస్తాడు.

జైసింగ్ : ఆయన వాగ్దానం చేసిన విధంగా ఆయన భూమికి దిగిరావాలి. అప్పుడు తిరుగుబాటుదారు చేసింది న్యాయబద్ధమవుతుంది.

**శివాజీ:** ఆయన ఎక్కడి నుండి వస్తాడు? మన హృదయాలలోనే ఆయన స్పందిస్తున్నాడు. నేను ఆయన్ని గుండెలోనే చూసాను. అందుకే నా జీవనలక్ష్యాన్ని సాధించగల శక్తి నాకు కలిగింది.

జైసింగ్ : నీ లక్ష్యసాధనకు ఆమోదముద్ర ఏది? భగవంతుని సాధికార ప్రామాణికత ఉందా?

**శివాజీ:** ఒక రాజ్యాన్ని కూకటి వ్రేళ్లతో పెకలించాను. అది తిరిగి నిర్మించబడలేదు. ఒక జాతిని సృష్టించాను. అది ఇంకా అంతరించలేదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

కేవలం దైవమును హృత్పద్మము నందుంచినవారే కుశలురు: ధైర్యం వారి కవచంగా, విశ్వాసం వారి ఖడ్గంగా వారు సాగాలి ముందుకు. సన్నద్ధము దెబ్బవేయుటకు హస్తము, పరికించి కనిపెట్టు నిశితదృష్టిన, విసురుచు ఈటెను శత్రుసమూహము మీదకు, దివ్యతేజి సైన్యపు వీరులు, సైనికులు వారు.

శ్రీఅరవిందులు, 28:211

ఏ వస్తువునైనా దాని సముచిత స్థానంలో ఉంచినపుడే, దాని నిజమైన విలువను సంతరించుకుంటుంది. ఏ ప్రత్యేకతా లేనిదానిగా కనిపించే వస్తువు సైతం, దాని ఉచిత స్థానంలో ఉంచినపుడు, తన సంపూర్ణ విలువను పొందుతుంది.

— శ్రీమాత

## మా ప్రత్యేకతలు

* కౌన్సిలింగ్
* అకాడమిక్ కౌన్సిలింగ్
* బిహేవియర్ థెరపి
* సైకో థెరపి
* మారిటల్ (కపుల్) థెరపి
* ఫ్యామిలి థెరపీ
* డి-అడిక్షన్ థెరపి
* సెక్స్ థెరపి
* స్ట్రెస్ మేనేజ్‌మెంట్
* ఇ సి టి థెరపి
* పిల్లలకు, వృద్ధులకు ప్రత్యేక కౌన్సిలింగ్

## జయకృష్ణ సైకియాట్రిక్ కేర్ & కౌన్సిలింగ్ సెంటర్

శుభోదయ కాంప్లెక్స్ ఎదురుగా, హనుమాన్ గుడి దగ్గర, విజయ టాకీస్ రోడ్ , హన్మకొండ, వరంగల్, ఆం.ప్ర.

ఫోన్స్: 9848776430; 9394816840

డా. బి. జగదీశ్ బాబు M.B.B.S., D.P.M. F.I.PS.

సైకియాట్రిస్ట్ & కౌన్సిలర్ e-mail : jagadeeshbandari@yahoo.com